15-06-2025
ఆదివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 258 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి



## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రభుత్వం హైటెక్స్ లో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అద్భుతంగా నిర్వహించారు. ఈ వేడుకలో సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఇక కళారంగంలో అత్యంత ప్రతిభ కనపర్చిన వారికి అవార్డులను అందించారు. అంతేకాకుండా ప్రశంసా పత్రంతో పాటు క్యాష్ ప్రైజ్ ను కూడా అందించారు. మణిరత్నం, సుహాసిని, మురళీ మోహన్, జయసుధ, జయప్రద, అల్లు అర్జున్, నందమూరి బాలకృష్ణ, విజయ్ దేవరకొండ, రీతూ వర్మ, నివేదా థామస్, అనన్య నాగళ్ల తదితరులు పాల్గొన్నారు. ఇక గద్దర్ అవార్డ్స్ 2024 విన్నర్స్ గా గెలిచి అవార్డులు అందుకున్నవారు ఎవరెవరంటే....

...మిగతాది 2 లో



## సైప్రస్ కు మోడీ.. టార్గెట్ టర్కీ

జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 14:

జీ7 సదస్సుల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ కెనడాకు వెళ్లనున్నారు. మొదట ఈ సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందలేదు. అయితే జీ7 సభ్యదేశాల ఒత్తిడితో కెనడా తప్పనిసరి పరిస్థితిలో భారత్‌ను ఆహ్వానించింది. దీంతో మోదీ కెనడా వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఓ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. అతి చిన్న దేశంలోనూ పర్యటన షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2025 జూన్ 1516న సైప్రస్‌ను సందర్శించారు, ఇది 23 సంవత్సరాల తర్వాత భారత ప్రధాని చేసిన తొలి పర్యటన. జీ7 శిఖరాగ్ర సమావేశానికి (జూన్ 1517కెనడా) వెళ్లే మార్గంలో సైప్రస్‌లోనూ పర్యటించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ సైప్రస్‌తో మనకు పెద్దగా వ్యాపార, సైకిన సంబంధాలు కూడా లేవు. కానీ, మోదీ ఈ దేశంలో పర్యటన ఖరారు చేసుకున్నారు. దీని వెనుక పెద్ద వ్యూహం ఉందన్న చర్చ జరుగుతోంది. టర్కీపాకిస్తాన్ ఐక్యతకు చెక్ పెట్టడానికి, టర్కీ శత్రు దేశాలైన సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో మైత్రిని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్యగా నిలిచింది.2025 ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్' సందర్భంగా టర్కీ పాకిస్తాన్‌కు సైనిక, రాజకీయ మద్దతు ఇచ్చింది. టర్కీ డ్రోన్ టెక్నాలజీ, ఆయుధ

...మిగతాది 2 లో

## 498ఏ టీ కేఫ్

జయభేరి, జైపూర్, జూన్ 14 :

భార్య తనపై పెట్టిన కేసులకు నిరసనగా అత్తారింటి ముందు టీకొట్టు పెట్టి చేతులకు బేడీలు వేసుకొని ఓ భర్త టీ అమ్ముతున్న ఘటన రాజస్థాన్‌లోని అంటా జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్‌కు చెందిన కృష్ణ కుమార్ ధాకడ్ అనే వ్యక్తికి మీనాక్షి మాలవ్ అనే యువతితో 2018లో వివాహం జరిగింది. పెళ్లైన కొన్ని రోజులకు ఈ దంపతులు తేనెటీగల పెంపకం వ్యాపారాన్ని స్టార్ట్ చేశారు. ఈ వ్యాపారంతో వీరు చుట్టుపక్కన ఉన్న మహిళలకు కూడా ఉపాధి కల్పించారు. దీంతో వీరికి మంచి గుర్తింపు వచ్చింది. అయితే కొన్ని రోజుల తర్వాత తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి పుట్టింటికి వెళ్లిపోయిందని కృష్ణ కుమార్ తెలిపారు. అయితే ఇంటి నుంచి వెళ్లిపోయిన భార్య కొన్ని నెలల తర్వాత తన తీవ్ర ఆరోపణలు చేస్తూ వరకట్న వేధింపుల సెక్షన్ 498ఏ, సెక్షన్ 125 కింద కేసులు పెట్టిందని కృష్ణ కుమార్ తెలిపాడు. ఒక తప్పుడు కేసు వల్ల తన జీవితమంతా నాశనమైందని.. మూడేళ్లుగా తాను న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగట్లేదని భావోద్వేగానికి గురయ్యాడు. ఇక తనకు అన్యాయం చేసిన భార్యకు తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నాడు. భార్య తనపై పెట్టిన కేసుకు నిరసనగా అత్తారింటి ముందు ఓ టీ కొట్టును ప్రారంభించాడు. అయితే, ఆ టీ కొట్టుకు కృష్ణకుమార్ వినూత్నమైన పేరు పెట్టాడు. అదే భార్య తనపై పెట్టిన వరకట్న వేధింపుల సెక్షన్ 498 A కేఫ్ పేరుతో టీకొట్టును ప్రారంభించాడు. భార్య పెట్టిన కేసులో మూడేళ్ల పాటు తాను అనుభవించిన బాధను తెలియజేసేలా చేతులకు



బేడీలు వేసుకొని టీ అమ్మడం స్టార్ట్ చేశాడు. అంతే కాకుండా టీ షాప్‌లో కొన్ని బ్యానర్స్ కూడా ఏర్పాటు చేశాడు. తనకు న్యాయం జరిగే వరకు ఈ టీ మరుగుతూనే ఉంటుందని, 125 కింద ఎంత ఖర్చు ఇవ్వాల్సి వస్తుందో చాయ్ తాగుతూ చర్చించుకుందా రండి అంటూ ఉన్న నినాదాలతో కొన్ని బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేశాడు. చట్టాన్ని దుర్వినియోగం చేసి తనను తప్పుడు కేసులో ఇరికించిన ప్రాంతంలో టీ అమ్ముతూ నిష్పక్షపాతంగా ఈ న్యాయపోరాటం చేయాలని తాను నిర్ణయించుకున్నట్టు కృష్ణ కుమార్ తెలిపాడు.

## లైడిక్టేటర్ టెస్ట్ చేయించుకుందాం రండి..!



ఫార్ములా ఈ రేసు కేసులో తనకు నోటీసులు ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి, ప్రభుత్వాన్ని నడపడం చేతకాని జోకర్ ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మరల్చేందుకు పూటకో వేషం వేస్తున్నాడు.. రోజుకో కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. ఈ చిల్లర చేష్టలు, పనికిరాని డ్రామాలతో ప్రతినిత్యం తెలంగాణ ప్రజల గొంతుకై పోరాడుతున్న మమ్మల్ని అడ్డుకోలేరని ఈ దద్దమ్మ సీఎం, ఈ వైఫల్యాల కాంగ్రెస్ సర్కారు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.

జయభేరి, హైదరాబాద్ :

ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం, బ్యాంకు ద్వారా పంపిన 44 కోట్ల రూపాయలు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్ లోనే ఉన్నా, వాటిని వెనక్కి రప్పించడం చేతకాని ముఖ్యమంత్రి మరోసారి ఏసీబీ నోటీసులు పంపాడనన్నారు. చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరవడంతో పాటు.. విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తానని ప్రకటించారు. పదేళ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ రేవంత్ రెడ్డి కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్ లో ఉంది ఇద్దరిపై కూడా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్మూ, ధైర్యం ఈ పిరికి ముఖ్యమంత్రికి ఉన్నదా అని ప్రశ్నించారు. లై డిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా రేవంత్ రెడ్డి అని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సాక్షిగా సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. దివాళాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ఓ ముఖ్యమంత్రిగా నిస్సిగ్గుగా మీ అసమర్థతను చాటుకుంటున్న ఈ తరుణంలో విచారణల కోసం ప్రజాధనాన్ని వృధా చేయడం మానుకుని, వెంటనే లై డిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు అనడానికి కేటీఆర్ కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనమని హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కేటీఆర్ నైతిక స్థయిర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి ఈ నోటీసులు పంపించారన్నారు. మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధించే తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు.



## అహ్మదాబాద్ ఘటనపై ఎన్నో అనుమానాలు

- పక్షి ఏమైనా ఢీ కొట్టిందా

జయభేరి, గాంధీనగరం, జూన్ 14:

మూలుగా మనం బైక్ మీద ప్రయాణిస్తున్నప్పుడు.. అనేక జాగ్రత్తలు తీసుకుంటాం. హెల్మెట్ పెట్టుకుంటాం, టైర్లలో గాలి ఉందో, లేదో చూసుకుంటాం. పెట్రోల్ ను చెక్ చేసుకుంటాం.. ఇక త్రి చక్ర, నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణిస్తున్నప్పుడు మరింత జాగ్రత్తగా ఉంటాం అలాంటిది ఒక దేశం నుంచి మరొక దేశానికి వెళ్తున్నప్పుడు.. అది కూడా అంతర్జాతీయ విమానం ప్రయాణిస్తున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఏ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి? కానీ ఇవేవీ పాటించలేదా? విమానాన్ని పరిశీలించలేదా? నిర్లక్ష్యంగా వదిలేశారా? ప్రయాణికుడు తాను

...మిగతాది 2 లో



## రూ. కోట్లు టాక్స్ కట్టాలంటూ ఐటీ నోటీసులు..!

- చేసేదీ కూలీ పని, ఉన్నది 40 గజాల ఇల్లు..

జయభేరి, ఉత్తరప్రదేశ్ :

ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలోని చేనేత నగరం పిల్ఖువాకు చెందిన మొహల్లా రాణా పట్టి మహాదేవ్‌లో నివసిస్తున్న సుభాష్‌కు రూ.7 కోట్ల నోటీసు అందింది. సుభాష్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదాయపు పన్ను శాఖ అతనికి ఈ నోటీసు పంపింది. నోటీసు వచ్చినప్పటి నుండి ఆ ప్రాంతంలో కలకలం రేపుతోంది.

...మిగతాది 2 లో


## ఇంటింటికి తొలి అడుగు..




జయభేరి, విజయవాడ, జూన్ 14:

నెల 23 నుంచి నెల రోజులపాటు ఇంటింటికీ 'తొలి అడుగు' విజయయాత్ర జరపాలని టీడీపీ నేతలకు ఎమ్మెల్యే లకు, ఎంపీలకు సూచించారు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు. పార్టీ సంస్థాగత కమిటీలు త్వరగా పూర్తి చేయాలని..పార్టీ కోసం పని చేసేవారికి వాటిలో చోటు కల్పించాలని ఆయన నాయకులను ఆదేశించారు. తల్లికి వందనం నిధులు విడుదలతో సర్వత్రా సంతృప్తివ్యక్తం అవుతోందని,వచ్చే వారమే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామనీ ఆయన తెలిపారు. ఒకే నెలలో రెండు సూపర్ 6 పథకాలు అమలు చేసి చూపిస్తున్నామని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

## నీట్ లో తెలుగోళ్లు దుమ్ము లేపేశారు



జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 14:

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2025 పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) అధికారులు ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 4వ తేదీన నీట్ యూజీ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రాథమిక కీ ని విడుదల చేసి,

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సైప్రస్ కు మోడీ.. టార్గెట్ టర్కీ

సరఫరాల ద్వారా పాకిస్తాన్‌తో సహకారాన్ని బలపరిచింది. ఈ నేపథ్యంలో, శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా.. టర్కీతో విభేదాలున్న సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో భారత్ సంబంధాలు రాజకీయంగా కీలకమయ్యాయి.మోదీ సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టో డౌలిడెస్‌తో చర్చలు జరుపుతారు. ఆర్థిక, వాణిజ్య, ఇండియామిడిల్ ఈస్ట్‌యూరప్ ఎకనామిక్ కారిడార్ (IMEC)పై దృష్టి సారించారు. IMEC, టర్కీ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా, సైప్రస్, గ్రీస్ ద్వారా యూరప్‌ను మధ్యప్రాచ్యంతో కలుపుతుంది. సైప్రస్ ఈ కారిడార్‌లో భాగస్వామ్యం టర్కీకి ఆర్థిక, రాజకీయ ఒత్తిడిని సృష్టిస్తుంది. టర్కీకి సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో దీర్ఘకాల విభేదాలున్నాయి. 1974 టర్కీ ఆక్రమణ తర్వాత ఉత్తర సైప్రస్ వివాదం కొనసాగుతోంది. భారత్ సైప్రస్ ఐక్యత, సార్వభౌమత్వానికి యూఎన్ తీర్మానాల ద్వారా మద్దతిస్తుంది.తూర్పు మధ్యధరా సముద్ర సరిహద్దులపై టర్కీగ్రీస్ వివాదాలున్నాయి. భారత్‌గ్రీస్ సైనిక, ఆర్థిక సహకారం బలపడుతోంది, రక్షణ ఒప్పందాలు విస్తరిస్తున్నాయి. ఆర్మేనియాఅజర్‌బైజాన్ నాగోర్నోకరాబాఖ్ వివాదంలో టర్కీ అజర్‌బైజాన్‌కు మద్దతిచ్చింది. భారత్ ఆర్మేనియాకు ఆయుధ సరఫరా, రాజకీయ మద్దతు ద్వారా టర్కీ ప్రభావాన్ని సమతుల్యం చేస్తోంది. సైప్రస్ 2026లో ఈయూ కౌన్సిల్ అధ్యక్షత వహించనుంది, ఇది భారత్‌ఇయూ సంబంధాలను బలోపేతం చేస్తుంది. సైప్రస్ యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ శాశ్వత సభ్యత్వం, కాశ్మీర్ విషయంలో భారత్‌కు మద్దతిచ్చింది. పహల్గామ్ దాడిని ఖండించి, ఇయూ స్థాయిలో సరిహద్దు ఉగ్రవాద వ్యతిరేక చర్చలను ప్రోత్సహించింది.లిమాసోల్‌లో మోదీ, క్రిస్టోడౌలిడెస్ వ్యాపార సమావేశంలో పాల్గొన్నారు, రెండు దేశాల వ్యాపారవేత్తలను కలిపారు. సైప్రస్ మోదీకి 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకరియోస్ III' అవార్డు ప్రదానం చేసింది. సైప్రస్ విభజన రేఖ సందర్శన టర్కీకి రాజకీయ సందేశంగా నిలిచింది.మోదీ సైప్రస్ సందర్శన టర్కీపాకిస్తాన్ ఐక్యతకు చెక్ పెట్టడానికి, సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో మైత్రిని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్య. IMEC, ఇయూ సహకారం ద్వారా భారత్ టర్కీ ప్రభావాన్ని సమతుల్యం చేస్తోంది. ఈ పర్యటన మధ్యప్రాచ్య, యూరప్‌లో భారత్ రాజకీయ, ఆర్థిక స్థానాన్ని బలపరిచింది.

## ఘటనపై ఎన్నో అనుమానాలు

పరిశీలించిన లోపాలను ట్విట్టర్ వేదికగా విమానయాన సంస్థకు తెలియజేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందా? ఇప్పుడు ఇవే ప్రశ్నలను నిపుణులు లేవ నెత్తుతున్నారు. జరిగిన దారుణంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.. టేక్ ఆఫ్ ఆయన విమానం వెంటనే కూలిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. గతంలో పైలట్ పనిచేసిన అనుభవం ఎహసాన్ ఖలీద్ అనే వ్యక్తికి ఉంది. ఈ ప్రమాదాన్నిపద్యంలో ఆయన స్పందించారు. విమానానికి ల్యాండింగ్ గేర్ కిందికి ఎలా ఉంటుందని ఆయన విస్మయ వ్యక్తం చేశారు. ఆ గేర్ కిందికి ఉండడం పట్ల అనుమానం వ్యక్తం చేశారు. విమానం నడుపుతున్న పైలట్ ఏటీసీకి "మేడే కాల్" ఇచ్చారంటే అందులో వ్యవస్థ విఫలమైనట్టేనని పేర్కొన్నారు.. అసలు ల్యాండింగ్ గేర్ కిందకు ఉండడమే అర్థం కావడం లేదని ఆయన పేర్కొన్నారు. "విమానం గాల్లో ఎగిరిన వెంటనే ల్యాండింగ్ గేర్ దానంతట అదే లోపలికి వెళ్ళిపోతుంది. కూలిన విమానానికి సంబంధించిన ల్యాండింగ్ గేర్ కిందకు ఉంది. ఈ ప్రకారం ఇంజన్ విఫలం చెందినట్టే భావించాలని" ఖలీద్ చెప్తున్నారు. "లోహ విహంగం శక్తిని కోల్పోయింది. దానికి ఇంజన్లో తలెత్తిన లోపం కూడా కారణం కావచ్చు. సాధారణంగా విమానానికి సంబంధించి రెండు ఇంజన్లు ఒకేసారి వైఫల్యం చెందే అవకాశాలు ఉండదు. ఒకవేళ అంతటి స్వల్పకాలంలో ఏదైనా పక్షి ఢీకొంటే కూడా ఇంజన్లు విఫలమయ్యే అవకాశం లేదని" ఎహసాన్ ఖలీద్ పేర్కొన్నారు.అమెరికాలో ఏరో స్పేస్ సేఫ్టీ కన్సల్టెంట్ గా పనిచేస్తున్న ఆంటోనీ బ్రిక్ హౌస్ కూడా ఖలీద్ మాదిరిగానే అనుమానాలను వ్యక్తం చేశారు. టేక్ ఆఫ్ అయిన విమానానికి ల్యాండింగ్ గేర్ అసహజంగా ఉండడం ఈ ప్రమాదానికి కారణమని ఆయన భావించారు. విమానం ఉన్నట్టుండి ఒకేసారి కూలిపోతున్నప్పుడు.. ఆ దృశ్యాలను చూస్తే రన్వే వైపు ప్రయాణిస్తున్నట్టుగా కనిపించిందని ఆయన పేర్కొన్నారు.." అంతమంది ఉన్న విమానం ప్రయాణించడానికి పూర్తి సంసిద్ధతతో ఉందా? విమానాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేశారా? విమానానికి కీలకమైన రెక్కల స్లాట్, ఫ్లాప్ లు సరైన మార్గంలోనే ఉన్నాయా? అవి విమానం ఎగరడానికి సహకరిస్తున్నాయా? విమానం కూలిపోయిన తర్వాత కనిపిస్తున్న దృశ్యాలను చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. విమానాలను నడిపే క్రమంలో ల్యాండింగ్, టేక్ ఆఫ్ అనేవి అత్యంత జాగ్రత్తగా చేపట్టాల్సిన దశలు.. గాల్లో ఎగిరిన అభిమానాలు 200 నుంచి 650 అడుగులకు పైగా ఎత్తుకు చేరుకోలేనప్పుడు పైలెట్లు కచ్చితంగా టేక్ ఆఫ్ ఆపేస్తారు. అలాంటప్పుడు చివరి దశలో ఉండగానే ఈ సమస్య ఉత్పన్నమై ఉంటుందని" అమెరికా ఏవియేషన్ సేఫ్టీ కన్సల్టెంట్ జాన్ ఎం కాక్స్ ప్రకటించారువిమానానికి సంబంధించిన రెండు ఇంజిన్ లు విఫలం కావడం లేదా పక్షి ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని నిపుణులు అంచనా బిస్తున్నారు.. విమానం కూలిపోతున్నప్పుడు.. ఆ దృశ్యాలను చూస్తుంటే ఇంజన్లు శక్తిని అందించడంలో విఫలమైనట్టు తెలుస్తోంది. ఇదే అభిప్రాయాన్ని విమానయాన శాఖలో వైట్ బాడీ పైలెట్లుగా పనిచేస్తున్న వ్యక్తులు వ్యక్తం చేశారు. ఒక ఇంజన్ గనుక విఫలమైతే విమానం ఊగిపోతుంది.. కానీ అక్కడ అలాంటి పరిస్థితి లేదు. పైగా అభిమానం స్థిరంగానే ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే రెండు ఇంజన్లు విఫలమైనట్టే అనుకోవాలి. రెండు ఇంజన్లలో త్రస్ట్ లేదని ఓ కమాండర్ వెల్లడించారు. అనుకోకుండా పక్షులు ఢీకొంటే వెంటనే ఇంజన్లలో మంటలు ఏర్పడి ఉండవచ్చని.. అందువల్లే విమానం తన రెండు శక్తిని కోల్పోయి ఉంటుందని సీనియర్ పైలెట్లు చెబుతున్నారు.. ఒక ఇంజన్ విఫలం కావడం వల్ల.. లాండింగ్ గేర్ పైకి రాకపోవడం వల్ల.. రెండవ ఇంజన్ కూడా పూర్తిస్థాయిలో శక్తిని ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని.. ఆ సీనియర్ పైలెట్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## టాక్స్ కట్టాలంటూ నోటీసులు

ఫిర్యాదు తర్వాత, అధికారులు ఈ విషయంపై తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంలో అధికారుల నుండి న్యాయమైన దర్యాప్తు జరగాలని కార్మికుడు డిమాండ్ చేశాడు. అయితే, ఫిబ్రవరి 2024లో ఆదాయపు పన్ను శాఖ నుండి సుభాష్ ఇంటికి నోటీసు వచ్చింది. కానీ సుభాష్ ఈ నోటీసును పట్టించుకోలేదు. ఇప్పుడు మరోసారి 10 నుండి 15 రోజుల క్రితం, అతనికి ఆదాయపు పన్ను శాఖ నుండి మరో నోటీసు పంపింది. ఇందులో రూ.7 కోట్ల లావాదేవీ జరిగిందని ప్రస్తావించింది. ఈ విషయం గురించి సుభాష్ ఇప్పుడు సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. సుభాష్ ఆ ప్రాంతంలో 40 గజాల ఇంట్లో నివసిస్తున్నాడు. సమాచారం ప్రకారం, 2020, 21 సంవత్సరంలో, దోహ్రానాలోని ఒక ఆసుపత్రి నుండి GSTకి సంబంధించిన రెండు పెద్ద లావాదేవీల గురించి ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందింది. ఈ లావాదేవీలో సుభాష్ పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. సమాచారం ప్రకారం, సుభాష్ పేరుతో GSTR1, GSTR3B లలో లావాదేవీలు జరిగాయి. దాదాపు రూ. 3,27,40,680 తోపాటు రూ. 3,75,74,0850 లావాదేవీలు నమోదు అయినట్లు చెబుతున్నారు. లావాదేవీ ఆధారంగా, హాపూర్‌లోని ఆదాయపు పన్ను శాఖ అధికారి ఫిబ్రవరి 9, 2024న నోటీసు జారీ చేసి, ఫిబ్రవరిలో సుభాష్‌కు సమాధానం అడిగారు. అతను నోటీసుకు సమాధానం ఇవ్వలేదు. నోటీసును పట్టించుకోలేదు. నోటీసుకు సమాధానం అందకపోవడంతో, శాఖ కఠినంగా వ్యవహరించడంతో, సుభాష్ అధికారులను సంప్రదించి న్యాయం కోసం వేడుకున్నాడు. ఈ మొత్తం విషయంలో న్యాయమైన దర్యాప్తు నిర్వహించాలని సుభాష్ అధికారులను వేడుకున్నాడు. ఈ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత, అధికారులు కూడా సీరియస్‌గా తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ మొత్తం కేసులో, సుభాష్ పత్రాల దుర్వినియోగం జరిగిందనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పుడు దర్యాప్తు తర్వాతే సుభాష్‌కు రూ.7 కోట్ల లావాదేవీకి మధ్య సంబంధం ఏమిటో స్పష్టమవుతుంది.


## నీట్ లో తెలుగోళ్లు దుమ్ము లేపేశారు

అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడించింది. అభ్యర్థులు తమ స్కోర్ కార్డులను ఈమెయిల్ ద్వారా లేదా తమ వ్యక్తిగత లాగిన్ వివరాలతో అప్లికేషన్ నంబర్‌ను ఎంటర్ చేసి చూసుకోవచ్చని ఎన్‌టీఏ సూచించింది. ఈసారి ఫలితాల్లో తెలుగు విద్యార్థులు తమ సత్తా చాటారు. తెలంగాణ నుంచి ఏకంగా 41,584 మంది విద్యార్థులు నీట్ లో అర్హత సాధించగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 36,776 మంది ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్ సాయికుమార్ జాతీయ స్థాయిలో 18వ ర్యాంకును కైవసం చేసుకోగా, షణ్ముఖ నిషాంత్ 37వ ర్యాంకు, మంగరి వరుణ్ 46వ ర్యాంకు, యంద్రపాటి షణ్ముఖ్ 48వ ర్యాంకు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి దర్బా కార్తీక్‌రామ్ 19వ ర్యాంకు, కొడవటి మోహిత్ శ్రీరామ్ 56వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచారు. దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.

# భారత్ రుద్రాస్త్ర.. భార్గవాస్త్ర...

భారత సాయుధ దళాలు ఆధునిక యుద్ధ సాంకేతికతలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి. ఇప్పటికే దేశీయంగా అనేక ఆయుధాలు రూపొందించుకోవడం తోపాటు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. ఇదే సమయంలో విదేశాల నుంచి కూడా అవసరమైన ఆయుధాలు కొనుగోలు చేస్తోంది.



ఈ క్రమంలో నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (SDAL) రూపొందించిన 'రుద్రాస్త్ర' అనే హైబ్రిడ్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ మానవ రహిత విమానం (యూఏవీ)2025, జూన్ 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించబడింది. దీనిని నిఘా, రక్షణ, గుర్తింపు, కచ్చితమైన దాడుల కోసం రూపొందించారు. ఇది భారత సైన్యానికి బహుముఖ సామర్థ్యాలను అందిస్తుంది. తాజా పరీక్ష భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది.రుద్రాస్త్ర యూఏవీ 50 కిలోమీటర్ల మిషన్ పరిధిలో అద్భుతమైన పనితీరును ప్రదర్శించింది, రియల్-టైమ్ వీడియో ఫీడ్‌ను స్థిరంగా అందించడంతోపాటు, సురక్షితంగా లాంచింగ్ పాయింట్‌కు తిరిగి వచ్చింది. లక్ష్యంపై చక్కర్లు కొట్టే సామర్థ్యంతో దీని మొత్తం పరిధి 170 కిలోమీటర్లకు చేరుకుంటుంది. ఇది 1.5 గంటల పాటు నిరంతరాయంగా గగనతలంలో ప్రయాణించగలదు. పరీక్ష సమయంలో, ఈ యూఏవీ యాంటీ-పర్సనల్ వార్‌హెడ్‌ను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంపై ప్రయోగించి, భూమికి సమీపంలో ఉన్నప్పుడు పేల్చడంలో విజయవంతమైంది. ఈ పరీక్ష భారత సైన్యం నిర్దేశించిన కఠిన ప్రమాణాలను అందుకుంది, ఈ రుద్రాస్త్ర బహుముఖ సామర్థ్యాలను నిరూపించింది.భారత్ డ్రోన్ యుద్ధ సాంకేతికతలో వేగంగా ముందుకు సాగుతోంది. రుద్రాస్త్రతో పాటు, సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ మరో కీలకమైన ఆయుధం, 'భార్గవాస్త్ర' అనే యాంటీ-డ్రోన్ వ్యవస్థను 2025 మే 13న ఒడిశాలోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించింది. ఈ వ్యవస్థ డ్రోన్ సమూహాలను నిష్క్రియం చేయడానికి మైక్రో-రాకెట్లను ఉపయోగిస్తుంది,

> **ఈ వ్యవస్థలు ఆధునిక యుద్ధంలో కీలకమైన డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడంతోపాటు, నిఘా, కచ్చితమైన దాడులు, సరిహద్దు రక్షణలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. DRDO, SDAL ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ, భారత సైన్యాన్ని అత్యాధునిక యుద్ధ సామర్థ్యాలతో బలోపేతం చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో స్కైస్ట్రైకర్ డ్రోన్ల వినియోగం భారత్–ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం ఫలితాలను ప్రదర్శించింది.**

ఇది ఆధునిక యుద్ధంలో డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడానికి కీలకమైన సాధనంగా నిలుస్తుంది.డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ రుస్తుం సిరీస్ డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది, ఇవి మధ్యస్థ ఎత్తులో ఎక్కువ సమయం ప్రయాణించే సామర్థ్యంతో రూపొందించబడ్డాయి. ఇవి నిఘా, యుద్ధం సామగ్రి సరఫరా కోసం ఉపయోగపడతాయి. అదానీ డిఫెన్స్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి ప్రముఖ సంస్థలు కూడా అధునాతన డ్రోన్ తయారీలో పాల్గొంటున్నాయి. ఇవి సరిహద్దు రక్షణ, యుద్ధ వ్యూహాలను మెరుగుపరుస్తున్నాయి.2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో, ఇజ్రాయెల్ సాంకేతికత సహాయంతో బెంగళూరులోని ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ రూపొందించిన స్కైస్ట్రైకర్ కామికేజ్ (ఆత్మాహుతి) డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా ఉపయోగించింది. ఈ డ్రోన్లు పాకిస్థాన్ రాడార్లు, కాన్వాయ్‌లు, ఇతర కీలక స్థావరాలను నాశనం చేశాయి. ఇది భారత్ డ్రోన్ యుద్ధ సామర్థ్యాలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చేసింది. రుద్రాస్త్ర యూఏవీ, భార్గవాస్త్ర వంటి స్వదేశీ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో సాంకేతిక స్వావలంబన దిశగా దూసుకెళ్తున్నాయి. ఈ వ్యవస్థలు ఆధునిక యుద్ధంలో కీలకమైన డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడంతోపాటు, నిఘా, కచ్చితమైన దాడులు, సరిహద్దు రక్షణలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. DRDO, SDAL ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ, భారత సైన్యాన్ని అత్యాధునిక యుద్ధ సామర్థ్యాలతో బలోపేతం చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో స్కైస్ట్రైకర్ డ్రోన్ల వినియోగం భారత్-ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం ఫలితాలను ప్రదర్శించింది. ఈ విజయాలు భారత్‌ను డ్రోన్ యుద్ధ సాంకేతికతలో ప్రపంచ నాయకుడిగా నిలపడానికి దోహదపడతాయి. అయితే, ఈ సాంకేతికతలను మరింత సమర్థవంతంగా, స్థిరమైన ఉత్పత్తి, శిక్షణతో అమలు చేయడం భవిష్యత్తులో కీలకం.రుద్రాస్త్ర, భార్గవాస్త్ర, స్కైస్ట్రైకర్ వంటి డ్రోన్ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత, అంతర్జాతీయ సహకార సమ్మేళనాన్ని సూచిస్తున్నాయి. ఈ పురోగతులు భారత సాయుధ దళాలను ఆధునిక యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేస్తూ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తున్నాయి.

# ఇంటింటికి తొలి అడుగు..




**ఈ సమావేశంలో చంద్రబాబు పార్టీ నేతలకు సూచించిన అంశాలు ఇవే :**

1) 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఈ నెల 23 నుంచి నెల రోజుల పాటు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలు వివరించాలి.

2) ఈ కార్యక్రమంలో లీడర్ నుంచి కేడర్ వరకూ ప్రతి ఒక్కరూ విజయయాత్రలో పాల్గొనాలి. ప్రచారం చేసే విషయంలో పోటీ పడాలి.

3) మొదటి ఏడాది ఏం చేశామో చెప్పడంతోపాటు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. ఏడాదిలో టీడీపీ సాధించిన విజయాలు తట్టుకోలేకనే ప్రత్యర్థులు మహిళలను అవమానించడంతో పాటు దాడులకు దిగుతున్నారు.

4) మహానాడు విజయవంతమైందని సేద తీరొద్దు. పార్టీ సంస్థాగత కమిటీలు పూర్తి చేయాలి. పార్టీ కోసం కష్టపడేవారికి అవకాశం కల్పించాలి. అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుని కమిటీల్లో స్థానం కల్పించాలి.

5) కుటుంబ సాధికార సారథిలో ఉంటేనే ఎవరికైనా పదవులు వస్తాయి. కార్యకర్తలు ఎప్పుడూ డైనమిక్‌గా ఉండాలి.

6) జులై నుంచి కార్యకర్తలు, నేతలకు నాయకత్వ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తాం. కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దుతాం. అధికారంలో లేనప్పుడు కార్యకర్తలు చాలా కష్టపడ్డారు. ఎమ్మెల్యేలు కూడా ప్రతి రోజూ పార్టీ కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలి. ప్రజలతో నిత్యం కలుపుగోలు తనంతో మెలగాలి.

7) రాష్ట్రంలో పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాం. విశాఖపట్నంలో ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని 5 లక్షల మందితో నిర్వహిస్తున్నాం.

8) అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 2.21 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడు రోజులు పాల్గొంటే సర్టిఫికేట్ ఇస్తాం. యోగా జీవితంలో భాగం కావాలి. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజంగా మారడానికే దీనికి శ్రీకారం చుట్టాం. ఇది మనందరి కార్యక్రమం. ఏపీని ప్రపంచ పటంలో పెట్టేందుకు చేపట్టిన ఉద్యమం.

9) శనివారం లక్ష చోట్ల యోగా డే సన్నద్ధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే యోగా లాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం.

10) ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం అమలు చేశాం. చెప్పిన మాట ప్రకారం ఎంతమంది ఉన్నా పథకం వర్తింపజేస్తామని చెప్పి ఇచ్చాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులతో నిర్వహించాల్సిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని అహ్మదాబాద్‌లో విమానం కూలడంతో రద్దు చేశాం. కార్యకర్తలు, నాయకులు ఎన్నికల ముందు సూపర్6, మేనిఫెస్టో, బాబు ష్యూరిటీభవిష్యత్ గ్యారంటీ గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. వాటిని కూటమి ప్రభుత్వం అమలు చేసి చూపిస్తోంది.

11) ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ముఖ్య పథకాలన్నీ ఏడాదిలోపే అమలు చేస్తున్నాం. విచ్చలవిడి అప్పులతో గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్లు తల్లికి వందనం పథకాలు విడుదల చేశాం. తల్లుల అకౌంట్లో రూ.13 వేలు, పాఠశాలల అభివృద్ధికి రూ.2 వేలు కేటాయిస్తున్నాం. పాఠశాలలు తెరిచేలోపే పథకం అమలు చేస్తామని చెప్పి చేశాం.

12) ఒక బిడ్డ ఉన్న తల్లులు 18,55,760 మంది, ఇద్దరు బిడ్డలు ఉన్న తల్లులు 14,55,322 మంది, ముగ్గురు బిడ్డలు ఉన్న తల్లులు 2,10,684 మంది, నలుగురు బిడ్డలు ఉన్న తల్లుల 20,053 మంది ఉన్నారు.

గత ప్రభుత్వం 42 లక్షల మందికే పథకాన్ని అమలు చేసింది. ఆ ప్రభుత్వం కంటే మన ప్రభుత్వం 25 లక్షల మందికి అదనంగా ఇస్తోంది. వారు చేసిన ఖర్చు రూ.5,540 కోట్లు, మన ప్రభుత్వం చేసే ఖర్చు రూ.8,747 కోట్లు. వాళ్ల కంటే ఏడాదికి రూ.3,205 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నాం.తల్లికి వందనం పథకం నిధుల విడుదలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని వేల కోట్లు ఒక పథకానికిక ఒకేసారి విడుదల చేయడం ఒక చరిత్ర. నలుగురు పిల్లులు ఉంటే రూ.13 వేల చొప్పున రూ.52 వేలు వారి అకౌంట్లోకి వెళ్తున్నాయి. అయినా బుద్ధి, జ్ఞానం లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. నిబంధనలు కూడా మార్చకుండా మెరుగ్గా ఇస్తున్నాం.

13) ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను కూటమి కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మనం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

14) ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఏడాదికి రూ.34 వేల కోట్లు ఇస్తున్నాం. అన్నాక్యాంటీన్ల ద్వారా 4 కోట్ల భోజనాలు సరఫరా చేశాం. రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ కింద ఈనెల 20వ తేదీన పథకాన్ని ప్రారంభిస్తున్నాం.' అని సీఎం అన్నారు.

# కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గం

■ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్ణ కుమార్




జయభేరి, రంగారెడ్డి జిల్లా :

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలో గల అన్ని కోర్ట్ ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడమైనది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్ణ కుమార్ మాట్లాడుతూ.. ఈ జాతీయ లోకాదాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ లోకదాలత్ లో సెటిల్ చేసుకోవడం ద్వారా తాము సివిల్ కేసులలో చెల్లించిన కోర్ట్ ఫీస్ కూడా తిరిగి పొందొచ్చు అని చెప్పారు. తమ కేసులను అనగా ఆస్తి పరమైన కేసులు, కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్ అదాలత్ లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అని అన్నారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి / సీనియర్ సివిల్ జడ్జి P. శ్రీ వాణి మాట్లాడుతూ.. రంగా రెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్ట్ ప్రాంగణాలలో 22 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్జ్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకొన్నారు అని చెప్పారు. ఈ లోక్ అదాలత్ నిర్వహించుటలో పోలీస్ వారు, ఇన్సూరెన్స్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పానెల్ అడ్వొకేట్స్, DLSA సిబ్బంది తమవంతు సహాయసహకారాలను అందించారు కక్షిదారులు సంతోషం వ్యక్త పరిచారు. ఇట్టి జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కక్షిదారులకు ఉచితంగా భోజనాన్ని అందించింది.

ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, బ్యాంకు రికవరీ, ప్రీటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 2,05,000 పై చిలుకు కేసులు పరిష్కరించబడ్డాయి. అలాగే అన్ని కేసులలో కలిపి Rs.5,24,82,919/రూపాయల వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగింది.



## అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ యువ నాయకులు

జయభేరి, గుడిపల్లి :

గుడిపల్లి మండల కేంద్రంలోని ఇటీవలే అనారోగ్యంతో మరణించిన, కొమిర వెంకటేశ్వర్లు (kvt), మరియు పోలే శ్రీనయ్య, కుటుంబ సభ్యులను, బిఆర్ఎస్ మండల నాయకుడు, సిఎస్ ఫౌండేషన్ చైర్మన్, గోలి గిరి, పార్టీ నాయకులతో కలిసి పరామర్శించాడు.వారి యొక్క కుటుంబ సభ్యుల స్థితిగతులను తెలుసుకొని, దశదినకర్మ కార్యక్రమానికి గాను, తనవంతుగా బియ్యం మరియుఆర్థిక సహకారం అందించాడు.మృతుడు శ్రీనయ్య, భార్య క్యాన్సర్ తో, కుమారుడు మానసిక వైకల్యంతో, మరియు మృతుడు కేవిటి కుటుంబం ఆర్థికంగా ఛిద్రమవడం తో ఇరు కుటుంబాలను ఓదార్చాడు. గత కొన్ని సంవత్సరాలుగా, సామాజిక కార్యక్రమాలతో చేయూత నందిస్తున్నగోలి గిరిని, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో, మండల నాయకులు మాజీ వైస్ ఎంపీపీ ముఖ్య సలహాదారులు అరవపల్లి నరసింహ, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎర్ర యాదగిరి, గోలి రవి, ఈశ్వర్, శ్యాం, రాంబాబు, వెంకట్, నాగరాజు, వంశీ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో ఆదుకుంటున్న రక్తదాత

జయభేరి, గజ్వేల్, జూన్ 14 :

వర్గల్ మండలం నాచారం గ్రామానికి చెందిన యువకుడు ఈసూరి యాదగిరి 15 సార్లు రక్తదానం చేశారు. ఎక్కడ ఎవరికి ఏ పరిస్థితుల్లోనైనా రక్తం కావాలి అని అతనికి తెలిస్తే అక్కడికి వెళ్లి రక్తదానం చేస్తాడు. తనకి చిన్నప్పుడు చదువులు చెప్పిన వర్గల్ మండలం చాంద్ కాను మక్త ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పరాల ప్రశాంత్ కుమార్ అతనికి ఆదర్శం అని చెబుతుంటాడు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బిజెపి ప్రభుత్వంతోనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి

జయభేరి, గజ్వేల్, జూన్ 14 :



భారతీయ జనతా పార్టీ సంకల్పంతో సహకార కార్యక్రమాలలో భాగంగా మెదక్ పార్లిమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు మరియు జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ఆదేశాల మేరకు శనివారం వర్గల్ మండలంలోని వేలూరు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా దేశం ఎంతో అభివృద్ధి చెందిందని ప్రపంచ దేశాలలో భారత దేశం ఎంతో ప్రఖ్యాతినీ సంపదించిందని అన్నారు. అంతర్గతంగా సబ్కా సాత్ సబ్కా వికాస్ అనే నినాదంతో ప్రతీ గ్రామంలో నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు చేరేలా ఆయన అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. అటువంటి గొప్ప నాయకుడికీ ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బాలు గౌడ్, రాజు యాదవ్, రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, OBC మోర్చ మాజీ అధ్యక్షులు ఉప్పరి షేకర్, రేణుదాస్, శ్రీకాంత్, పవన్, మధు, మహమ్మద్, తోట ప్రభాకర్ ,మహేష్, రవి, గాలయ్య, భాను, నర్సంలు, సత్తయ్య, యాదగిరి మరియు కుమార్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## డాన్ టు డస్క్ సేవా కార్యక్రమాలు




జయభేరి, దేవరకొండ :

శ్రీ వాసవి కళ్యాణ మండపంలో చీఫ్ గెస్ట్ చంద్రమౌళి నిర్వహించడం జరిగింది. కార్యక్రమాల వివరాలు స్వాగతం బోర్డు ఏర్పాటు చేయుట దివ్యాంగుల కిట్ గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్టాపన చెప్పులు కుట్టే వారికి గొడుగు పంపిణీ జవాన్లకు సన్మానం విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ మొదలగు సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో IPC బెలిదే మాధవి డిస్ట్రిక్ట్ ఇంచార్జ కొండూరు శోభన్ బాబు రీజన్ సెక్రెటరీ బచ్చు సతీష్, రీజన్ చైర్మన్ గందే మహేష్, రీజన్ సెక్రెటరీ నీలా సంజీవ కుమార్, REC ఆలంపల్లి పద్మ, డిస్టిక్ చైర్మన్ అర్ధం రమేష్,వాసవి క్లబ్ అధ్యక్షులు సముద్రాల సహదేవ్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు గుమ్మడవెల్లి మహాలక్ష్మి వాసవి వనిత క్లబ్ సెక్రటరీ వీరమల్ల భాగ్యమ్మ కార్యదర్శి షీలా చంద్రకళ ఆర్యవైశ్య సంఘం సభ్యులు మరియు వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ఎవ్వరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా రేషన్ కార్డును పొందవచ్చును

జయభేరి, తుర్కపల్లి, జూన్ 14 :




ఎవ్వరికి ఒక్క రూపాయి ఇవ్వకుండా రేషన్ కార్డు పొందవచ్చునని తహసిల్దార్ జి. దేశ్యా నాయక్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఇస్తున్న రేషన్ కార్డుల కోసం ఎవ్వరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా రేషన్ కార్డు పొందవచ్చునని, రేషన్ కార్డులో పేరు లేకుంటే మీ కుటుంబ సభ్యులకు కార్డులో చేరడానికి, ప్రత్యేక కార్డు కావాలంటే మీరు గతంలో ఉన్న కార్డు నుండి తొలగించుకొనుటకు మీసేవ ద్వారా అప్లై చేసుకుంటే చాలు మూడు రోజుల్లో రేషన్ కార్డు వస్తుందని అన్నారు. ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తహసిల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కల్పన ,ఆర్ఐ లు జహంగీర్, రఘు రామారావు, సీనియర్ అసిస్టెంట్ సాలెం, ఎంపీఎస్ఓ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు పుండరీకం, రమేష్, కరుణాకర్, స్వరూప, సర్వే శ్రీనివాస్, రికార్డ్ అసిస్టెంట్లు చరణ్ సింగ్, తేజస్విని, పాల్గొన్నారు.

## జనసేన ప్రమాద బీమా సభ్యత్వం పొందిన సభ్యులకు కిట్లు పంపిణీ

■ ఇంచార్జి జరుపుల రాజు నాయక్



జయభేరి, షాద్ నగర్, జూన్ 14 :

జన సేన పార్టీ ప్రమాద బీమా సభ్యత్వాన్ని పొందిన సభ్యులకు షాద్ నగర్ రామక్రిష్ణ థియేటర్ లో తొలిప్రేమ సినిమా ప్రిరీలీజ్ సందర్భంగా ఆంధ్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు అయన స్పూర్తితో ప్రతి అభిమానులు జన సేన నాయకులు 500 రూపాయలు చెల్లించి ఐదు లక్షల ప్రమాద భీమా సభ్యత్వ నమోదు అదేవిధంగా సభ్యత్వం రెన్యువల్ చేసుకునీ సభ్యత్వం పొందిన వారికి శనివారం ఇంచార్జి రాజు నాయక్ ఆయన చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ.... భవిష్యత్తులో తెలంగాణ లో జన సేన పార్టీ మరింత బలోపేతం చేయడానికి గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి గ్రామంలో పవన్ కళ్యాణ్ అభిమానులు, మెగా అభిమానులు ఉన్నారని ప్రతి సందర్భంలో సేవా దృక్పథంతో ముందుకు వచ్చి అనేక సేవలు చేస్తున్నారని భవిష్యత్తులో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని తెలంగాణలో జన సేన సభ్యత్వ నమోదు సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జన సేన విద్యార్థి విభాగం కో అడినేటర్ శ్రీశైలం, లింగం నాయక్, అశోక్,శంకర్ నాయక్, ఎండి.మసూద్, జె.ప్రసాద్,రమేష్, శివ హరి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కి ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించిన మాజీ ఎమ్మెల్యే



జయభేరి, దేవరకొండ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు కి ఏసీబీ మరోసారి నోటీసులు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రంగా ఖండించారు. ఏసీబీ అధికారులు గతంలో ఒకసారి కేటీఆర్ ని సుదీర్ఘంగా విచారించి ఏమీ తేల్చలేకపోయిన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. ఫార్ములాఈ రేస్ సజావుగా సాగిందని, ఇందులో ఎలాంటి అక్రమాలు జరుగకున్నా, ఎటువంటి అవినీతి చోటుచేసుకోకున్నా కేటీఆర్ నివిచారించడం చట్ట వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక హామీలను అమలుచేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇటువంటి కుయుక్తులు పన్నుతున్నదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఫార్ములాఈ రేస్ నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నగరానికి ప్రత్యేక పేరు ఖ్యాతి లభించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడానికి దోహదపడిందని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించే వారిపై అధికార పక్షం అక్రమ కేసులు బనాయిస్తూ,కక్షపూరిత రాజకీయాలకు పాల్పడడాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ఆయన చెప్పారు.ఇటువంటి కుట్రలు, కుయుక్తులకు బీఆర్ఎస్ నాయకులు,శ్రేణులు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడబోరని ఆయన స్పష్టం చేశారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :



మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బ్రమ్మపూరి, మీన నగర్ కాలనీ లో 21 లక్షల రూపాయల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని పార్టీలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## RK సేవా ఫౌండేషన్ తరుపున SI కోటేష్ కి సన్మానం

జయభేరి, దేవరకొండ :



Rk సేవా ఫౌండేషన్ తరుపున దేవరకొండ SI గా విధులు నిర్వహించి ట్రాన్స్ఫర్ అయినా రువ్వ కోటేష్ కి RK సేవా ఫౌండేషన్ తరుపున సన్మానం చేసి జ్ఞాపికను బహుకరించడం జరిగింది. అనంతరం RK సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్నరామకృష్ణ మాట్లాడుతూ SI చేసిన సేవలను అభినందించి,మరెన్నో ఉన్నత శిఖరాలను అధిగమించాలని ఆశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు మాస్టర్ చిత్తనూరి శ్రీనివాస్ ,అన్వార్, ప్రధాన కార్యదర్శి పొట్ట విజయ్ కుమార్, ఎండీ. ఉమేర్, కోచ్ సబ్బర్,రాజా, మాస్టర్ జగన్,గుండాల వెంకట్, కొండ ప్రేమ్ కుమార్, ఈ రామకృష్ణ, బ్రహ్మం,టీ ప్రతాప్, లింగం తదితరులు పాల్గొన్నారు.



## కరెంటు షాక్ తో పాడి గేదె మృతి

జయభేరి, తుర్కపల్లి, జూన్ 14 :

కరెంటు షాక్ తో పాడి గేదె మృతి చెందిన సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆకుల యాదగిరి కి చెందిన పాడి గేదే మేస్తున్న సమయంలో కరెంటు స్తంభానికి ఉన్న వైరు తెగిపడి ఫినిషింగ్ వైర్ పై పడటంతో పాడి గేదెకు కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదపై ఆధారపడి జీవించే నిరుపేద కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, సుమారు 1,50,000 పాడి గేదె మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

## ఘనంగా సోక్కుల మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



జయభేరి, తుర్కపల్లి, జూన్ 14 :

తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వభారత్ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్స్ దశరథ గౌడ్, మాజీ సర్పంచు లు సింగం వెంకటేశం, అప్పల మల్లేశం, ఆయుష్ అనుభవ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పెండెం రవి, స్కూల్ ప్రిన్సిపల్ నర్సి రెడ్డి, పాల్గొన్నారు.

## ఈనెల 19న శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర... ఇస్రో



జయభేరి, న్యూ ఢిల్లీ జూన్ 14:

సాంకేతిక సమస్యతో వాయిదా పడిన స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక ప్రయోగానికి సంబంధించి కొత్త తేదీని ఇస్రో (ISRO) తాజాగా ప్రకటించింది. ఈనెల 19న ఈ ప్రయోగం చేపట్టనున్నట్లు వెల్లడించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగం ద్వారా భారత్, పోలండ్, హంగేరీకి చెందిన నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపుతున్నారు. ఈ మిషన్‌కు భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా పైలట్‌గా వ్యవహరించబోతున్నారు.అమెరికా ప్రైవేట్ స్పేస్ సంస్థ 'యాక్సియమ్' చేపడుతున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 'ఏఎక్స్4' మిషన్ లో భాగంగా స్పేస్ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా వీరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. దీంతో ప్రైవేట్ రోదసి యాత్ర ద్వారా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారత వ్యోమగామిగా శుభాన్షు చరిత్రకెక్కనున్నారు. ఇప్పటికే భారత్‌కు చెందిన ప్రముఖ వ్యోమగామి రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. రష్యా సహకారంతో అంతరిక్షయానం చేశారు. రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేసిన నాలుగు దశాబ్దాల (1984) తర్వాత శుభాన్షు ఈ గౌరవాన్ని దక్కించుకోనున్నారు. నాసా సహకారంతో శుక్లా ఐఎస్ఎస్‌లో వివిధ శాస్త్రీయ పరిశోధనలు చేయనున్నారు. పైలట్‌గా ఈ యాత్రలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని శుక్లా ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. నిజానికి మే 29నే ఈ ప్రయోగం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. తొలుత ఈ ప్రయోగాన్ని జూన్ 8వ తేదీకి వాయిదా వేశారు. ఆ తర్వాత జూన్ 10, జూన్ 11కు వాయిదా పడింది. యాక్సియం 4 మిషన్‌కు సంబంధించిన ఫాల్కన్9 రాకెట్ తనిఖీల్లో ద్రవరూప ఆక్సిజన్ లీకేజ్ కారణంగా జూన్ 11న జరగాల్సిన ఈ ప్రయోగం మళ్లీ వాయిదా వేశారు. లీకేజ్‌కు సంబంధించిన మరమ్మత్తులు పూర్తిచేసేందుకు మరింత సమయం పడుతుందని, రాకెట్ లాంచింగ్‌ను వాయిదా వేస్తున్నట్టు స్పేస్ఎక్స్ తెలిపింది. ఈ క్రమంలో ఇప్పుడు కొత్త తేదీని ప్రకటించింది.

## పెండింగ్ బిల్లులు చెల్లించండి

- మాజీ సర్పంచుల వేడుకోలు




జయభేరి, హైదరాబాద్:

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ మాజీ సర్పంచులు వినూత్న రీతిలో నిరసనకు దిగారు. హైదరాబాద్ ఖైరతాబాద్ లోని తెలంగాణ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో పంచాయితీరాజ్ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళనకు చేపట్టిన మాజీ సర్పంచులు... కమిషనర్ లేకపోవడంతో కార్యాలయం గేటు కు వినతిపత్రాన్ని ముడుపు కట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ యాదయ్య గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించామని అంటుందని... కానీ బడా కాంట్రాక్టర్లకు బిల్లులను విడుదల చేశారన్నారు. తాము అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేస్తే , తమకు ఇవ్వకండ కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని ... ముందు తమ పెండింగ్ బిల్లులు చెల్లించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలి

- మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్

జయభేరి, హైదరాబాద్ :




ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం. అవి అసెంబ్లీ అయినా కావొచ్చు, పార్లమెంట్ అయినా కావొచ్చు, స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికలైనా కావొచ్చు. ప్రతి స్థాయిలో ఈ ఎన్నికలు సమయానికి అనుగుణంగా జరగాలని భువనగిరి మాజీ ఎంపి డా బూర నర్సయ్య గౌడ్ అన్నారు. కాని..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 18 నెలలు గడిచినా, ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత లేదు. రాష్ట్రంలో 12,769 మంది సర్పంచుల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 5,717 మంది ఎంపీటీసీల పదవీకాలం 2024 మే నెలలో ముగిసింది. ఇప్పటికీ ఈ స్థానాల్లో ఎన్నికలు జరగలేదు. 538 మంది జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ చైర్ పర్సన్ల పదవీకాలం కూడా పూర్తయ్యి సంవత్సరం దాటిపోయింది.

రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలలో 128 మున్సిపాలిటీల పదవీకాలం పూర్తై ఆరు నెలలు గడిచింది. అయినా ఇప్పటికీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికలు అనేవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243A, 243U, 243ZA పరిధిలో ఉన్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత మరియు స్టేట్ ఎలక్షన్ కమిషన్ అధీనంలో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణతో సంబంధం లేదు. ఇది పూర్తిగా రాష్ట్ర పరిధిలో ఉన్న అంశం. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు లేట్ కావడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు.

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి లోకల్ బాడీలకు అభివృద్ధి నిధులు ప్రధానంగా కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా వస్తాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావలసిన రూ. 1514 కోట్లు నిధులు ఎన్నికలు జరగకపోవడం వల్ల నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రజలు ఈ నష్టాన్ని భరించాల్సి వస్తోంది. అంతేకాక, గతంలో 14వ ఆర్థిక సంఘం కింద రావలసిన రూ. 800 కోట్ల బకాయిలు కూడా పెండింగ్లో ఉన్నాయి. ఇవి కూడా ఎన్నికల నిర్వహణ లేకపోవడం వల్ల విడుదల కాలేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. ఎన్నికల్లో రిజర్వేషన్ నిష్పత్తి నిర్ణయించే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆ ప్రక్రియను అమలు చేస్తుంది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఎలా ఉండాలన్న దానిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కానీ ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వడంలో విఫలమవుతోంది.

అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ గొప్పగా మాటలు చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసారు. కానీ ఆ హామీలు ఎటూ తీరకపోవడం, ఎన్నికలు జరగకపోవడం వల్ల అభివృద్ధి నిధులు నిలిచిపోవడం.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను చూపిస్తున్నాయి. అందువల్ల తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి, రాష్ట్రం నష్టపోకుండా చూడాలని అన్నారు.

ఆర్టికల్ 243 (U), 243 (Z), 243 (A) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హక్కు, బాధ్యత. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర లేదు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తే, రాష్ట్రంలో ఎన్నికలు జరగకపోవడం వల్ల ఆ నిధులు పూర్తిగా వినియోగం కావడం లేదు.

రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎంత ఉండాలో నిర్ణయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదే. అయితే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలన్నది ఇంకా అమలు రూపం దాల్చలేదు. బీసీలకు రిజర్వేషన్ పెంచాలంటే 'ట్రిపుల్ టెస్ట్' ప్రకారం... (1) కులగణన, (2) బీసీ కమిషన్, (3) డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలంప్రకటనలు చేసి, పబ్లిక్కు వివరాలు మాత్రం వెల్లడించలేదని అన్నారు.

ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టాలని చూడటం తప్పుదారి పట్టించే చర్య అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో బీసీ కులాల గణాంకాలను ప్రచురించాలని, రిజర్వేషన్లను అమలు చేసి ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. ఈ పరిస్థితుల్లో, ప్రతి రోజూ ఒక మంత్రి "ఇప్పుడు జరుగుతాయి", "తొందర్లో ఉంటాయి", "సంక్రాంతికి జరుగుతాయి" వంటి ప్రకటనలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

## నూతన లిటిల్ చాంపర్స్ ప్రీ స్కూల్ ప్రారంభం

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

జయభేరి, హయత్ నగర్ :



మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని ఆదిత్య నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన LITTLE CHAMPERS PRE SCHOOL ను ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ భువనగిరి పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ తో కలిసి GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.... ప్రీ స్కూల్లో చిన్నారులకు మానసిక అభివృద్ధితో పాటు ప్రాథమిక జ్ఞానాన్ని నేర్పించేందుకు రూపొందించబడినది. చిన్నవయస్సులోనే శిక్షణ ఇచ్చే విధానం వల్ల పిల్లల్లో నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి అన్నారు. అదేవిధంగా స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ ఇలాంటి ఆధునిక సదుపాయాలతో,మంచి మౌలిక సదుపాయాలు కలిగిన ప్రీ ప్లే స్కూల్‌ను మా డివిజన్లో ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈ ప్లే స్కూల్ మరెన్నో పిల్లల జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ లావణ్య చంద్ర శేఖర్, జతిన్ ముక్రజి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఎంపీటీసీల లిస్టు ఇవ్వండి

- మీనాక్షి నటరాజన్

జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నర తరువాతే పదవుల పంపకంపై ముందుడగు వేసింది. తొలుత ఆశావాహులైన కొందరు నేతలకు నామినేటెడ్పోస్టులను పార్టీ కట్టబెట్టింది. కొద్దిరోజుల కిందటే పీసీసీ కార్యవర్గాన్ని అధినాయకత్వం ప్రకటిచింది. కొత్తగా మంత్రివర్గ విస్తరణ చేపట్టి ముగ్గురికి క్యాబినెట్‌లో అవకాశం కల్పించింది. తాజాగా తెలంగాణ రాష్ట వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించారు. దీంతోనే శుక్రవారం గాంధీ భవన్‌లో డీసీసీ అధ్యక్షులతో పాటు రాష్ట్ర స్థాయి సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో జూమ్ మీటింగ్నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఈసందర్భంగా మీనాక్షి నటరాజన్డీసీసీ అధ్యక్షులు, పరిశీలకుల ద్వారా పలు అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే గ్రామ పంచాయతీలతోపాటు ఆ తరువాత వరుసగా మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, కొన్ని మునిసిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. వీటిలో సర్పంచ్‌ల పదవీకాలం 2024 ఫిబ్రవరికే ముగియగా.. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోందన్న విషయాన్ని మీనాక్షి దృష్టికి తెచ్చారు.

**స్థానిక సంస్థల తర్వాతే మండల కాంగ్రెస్ పార్టీ...**

గ్రామాల్లో పార్టీ పదవులపైనే ఆశలు పెట్టుకున్న నేతలు త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధం అవుతున్నారు. ఇలాంటి తరుణంలో మండల కాంగ్రెస్పార్టీ నాయకత్వ నియమకాలు చేపడితే ఎలా ఉండనుందని మీనాక్షి డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులను అడిగినట్టు తెలిసింది. ఒకవేళ ఇప్పటికిప్పుడు మండల కాంగ్రెస్పార్టీ నాయకత్వాన్ని ప్రకటిస్తే.. పదవులు దక్కని వారితో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదమే ఎక్కువ ఉన్నదని అధినాయకత్వం ఒక ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. ఎందుకంటే, పదవులు దక్కని వారు వేరేతర పార్టీలో వెళ్లిపోతే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్పార్టీకి ఎదురుదెబ్బ తగిలే అవకాశముందని మీనాక్షి నటరాజన్భావించినట్టు సమాచారం. దీంతోనే ఆమె మండల కాంగ్రెస్పార్టీ నాయకత్వం ఇప్పుడు కాకుండా.. స్థానిక సంస్థల తర్వాతే చేపట్టడమే బెటర్అని డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులతో వ్యాఖ్యానించినట్టు తెలిసింది. దీనికి అందరూ ఏకీభవించడంతో మండల కాంగ్రెస్పార్టీ నియమకాలు జోలికి వెళ్లవద్దని డిసైడ్అయిందని ఆ పార్టీ వర్గీయుల సమాచారం.

**2017 నుంచి సర్పంచ్, ఎంపీటీసీల లిస్టు ఇవ్వండి.**

ఇదిలాఉంటే.. 2017 సంవత్సరం నుంచి కాంగ్రెస్పార్టీల కొనసాగుతూ సర్పంచ్, ఎంపీటీసీలు గెలిచిన ప్రజాప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థులు జాబితా ఇవ్వాలని డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులను మీనాక్షి నటరాజన్కోరారు. వాస్తవానికి డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులను ఏర్పాటు చేసిన అధిష్టానం మండల కాంగ్రెస్పార్టీకి సంబంధించిన ఇదివరకే ఒక్కో మండలం నుంచి నలుగురి చొప్పున పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేశారు. ప్రస్తుతానికి ఇంచార్జి మీనాక్షి నటరాజన్తీసుకున్న నిర్ణయంతో ఆయా జాబితా కాకుండా సర్పంచ్, ఎంపీటీసీలు గెలిచిన ప్రజాప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థుల పేర్లు త్వరగా పేర్లు అందజేయాలని సూచించినట్లు తెలిసింది.

పదవుల్లో సామాజిక న్యాయం పాటించాం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. పార్టీలోనూ ప్రభుత్వంలోనూ పదవుల పంపిణి సామాజిక న్యాయ పరంగా జరుగుతుందన్నారు. రాహుల్ గాంధీ మార్గదర్శనంలో "సమాజంలో ఎవరి వాటా వారికే" అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన ప్రతి పదవిలోనూ సామాజిక న్యాయం పాటించామని, ఇకపై కూడా పార్టీ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి సరైన గుర్తింపునిస్తూ ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, పదవులు లభిస్తాయని స్పష్టంగా పేర్కొన్నారు.

**గ్రామ స్థాయిలో పకడ్బందీగా**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతలకు సూచించారు. మండల, జిల్లా స్థాయిల కమిటీల నిర్మాణం సకాలంలో పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పరిశీలకులు, కోఆర్డినేటర్లు నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను తెలంగాణలో విస్తృతంగా, విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఇతర రాష్ట్రాలకన్నా ముందుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఘనత మనదేనని పేర్కొన్నారు.



## బస్ పాస్ ధరల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి

- బస్ పాస్ ధరలను పెంచి ప్రజలపై గుదిబండను మోపారు
- అనేక రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదు
- ప్రజలను దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అలవాటుపడింది
- బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

జయభేరి, దేవరకొండ :

బస్ పాస్ ధరల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. బస్ పాస్ ధరలను పెంచి ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపింది అని ఆయన తెలిపారు. విద్యార్థులుపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతుంది అని ఆయన ఆరోపించారు.బస్ పాస్ ధరలను పెంచి ప్రజలపై గుదిబండను మోపారు అని ఆయన అన్నారు.అనేక రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదు అని ఆయన ఆరోపించారు.ప్రజలను దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అలవాటుపడింది అని ఆయన అన్నారు.బస్ పాస్ ఛార్జీలు పెంచి పేద విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్న కాంగ్రెస్ సర్కార్ అని,ఖజానా నింపుకునేందుకు విద్యార్థులే దొరికారా అని ఆయన ప్రశ్నించారు.


## యాభై వేలు ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు

జయభేరి, తాండూరు :

తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మి, భర్త మ్యాతరి రాములు, మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇండ్ల కోసం 50 వేల వరకు డబ్బులు ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని గ్రామ మాజీ సర్పంచ్ భర్త అడిగినట్టు తెలిపారు. తమ ఇల్లు కూలిపోయి 18 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు గ్రామ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లంచాలు ఇచ్చే స్తోమత తమకు లేదని తెలిపిన కూడా తమకు ఇల్లు రానట్టు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మాజీ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని చంద్రమంచ గ్రామానికి చెందిన మ్యాటర్ లక్ష్మి కోరింది. తమకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను వేడుకుంటుంది.

# ఈ ఖరీదైన చదువు "కొనలేం"

## రెక్కాడితే డొక్కాడనోళ్ళం



- ప్రాథమిక విద్యకే లక్షలాది ఫీజులు
- ప్రైవేట్ బడుల్లో నామమాత్రపు సౌకర్యాలు
- ఫీజులు తగ్గించాలంటు తల్లిదండ్రుల వేడుకోలు
- చేష్టలుడిగి చూస్తున్న విద్యాశాఖ అధికారులు
- ప్రైవేట్ దోపిడీపై చర్యలకు వెనకాడుతున్న పాలకులు

జయభేరి, హైదరాబాద్ :

ఒక పేద వాడు నెల అంతా కష్టపడి గొడ్డు చాకిరి చేస్తే పట్టుమని 10,000 దాటని సంపాదనతో ఇటు ఇల్లు గడపడమా? అటు పిల్లలను చదివించడమా అని నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పేద తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. ఒకనాడు 300 పెడితే ఇంటికి సరిపడా నెల గాసమంతా వచ్చేది, కానీ నేడు పెరిగిన ధరల వల్ల నెల అంతా కష్టపడి సంపాదించిన జీతంలో సగానికి పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వాలు సర్కారు విద్యను నిర్లక్ష్యం చేయడంతో ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది. వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. ప్రాథమిక విద్యకి లక్షలాది రూపాయల ఫీజులను తల్లిదండ్రుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తుండడం నేడు తెలుగు రాష్ట్రాల్లో కనబడుతోంది. ఒక పూట ఉపవాసం ఉన్నా పర్వాలేదు కానీ, తమ పిల్లలను ప్రయోజకులను చేయాలనే ఆకాంక్షలతో తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రైవేట్ బడులకే




పంపిస్తున్నారు. దీన్నే ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ పాఠశాలలు కనీస తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆట స్థలాలు ఇలా కనీస సౌకర్యాలు కల్పించకుండా, అర్హత గల స్టాఫ్ ను నియమించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అక్కడక్కడ తల్లిదండ్రులు నిలదీస్తున్నప్పటికీ వారిని తేలికగా తీసుకుంటూ వారి వ్యాపారాలను మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చేసుకుంటున్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు అక్కడక్కడ వీరి అనారోగ్యకర పోకడలకు అడ్డు కళ్లెం వేయడానికి ప్రయత్నాలు చేస్తున్న వారినీ మచ్చిక చేసుకుని వారి అక్రమ సామ్రాజ్యాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడక్కడ కొన్ని విద్యార్థి, ప్రజా సంఘాలు సైతం ప్రైవేట్ యాజమాన్యాలపై రాజీలేని ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. ఇలా గట్టిగా ఉద్యమస్తున్న ప్రాంతాల్లో, విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలకు దాసోహం అంటున్నారు. దీంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవలసిన సంబంధిత అధికారులే చేష్టలుగి అస్త్ర సన్యాసం చేస్తే మా గోడు చెప్పుకునేది ఎవరికని తెలుగు రాష్ట్రాల్లోని నిరుపేద తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రవేట్ స్కూల్ యాజమాన్యాల దోపిడి బహిరంగ రహస్యమే అని చెప్పవచ్చు. ఈ బహిరంగ దోపిడికి ప్రతిఫలంగా, ప్రతి ఏటా వందల కోట్ల రూపాయలు వారి జేబులు నింపుకుంటున్నారని చెప్పవచ్చు. ఈ తతంగమంతా అధికారంలో ఉన్న అన్ని ప్రభుత్వాలకు తెలిసినప్పటికీ , ప్రభుత్వాలు సైతం వారిని ఏమి చేయలేక చేష్టలుడిగి చూస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాల్లోని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా, వారికి చిత్తం వచ్చినట్లుగా ఫీజుల పట్టికలను తయారు చేయించుకోకుండా, ప్రభుత్వ అధికారులతో ఒక కమిటీని వేసి ఫీజులను నిర్వహించాలని రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



## ఇంకా కీలక శాఖలకు సీఎం దగ్గరే...

జయభేరి, హైదరాబాద్, జూన్ 14:

ప్రాంతీయ పార్టీలకు ఆయా రాష్ట్రాల రాజధానులలో కార్యాలయాలు ఉంటాయి. ప్రాంతీయ పార్టీలో వ్యక్తిస్వామ్యం నడుస్తుంది కాబట్టి.. ఆయన చెప్పినట్టుగానే పదవుల కేటాయింపు జరిగిపోతుంది. ఇది మనదేశంలో అత్యంత సర్వసాధారణమైన విషయం. అదే జాతీయ పార్టీ అయితే ఢిల్లీలో కార్యాలయాలు ఉంటాయి.. చాలామంది పెత్తనాలు సాగుతూ ఉంటాయి కాబట్టి.. ప్రతి విషయంలోనూ మంతనాలు జరుగుతూ ఉంటాయి. జాతీయ పార్టీలో నాయకులు ఒక్కో తీరుగా ఉంటారు. అందరిని సమన్వయం చేసుకొని.. అందరిని మచ్చిక చేసుకొన్న తర్వాతే పదవులు లభిస్తాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఈ సంస్కృతి ఎప్పటినుంచో ఉంది. అందువల్లే ఆ పార్టీలో ఏదైనా సాధ్యమే అనే నానుడి కూడా పుట్టింది. ముఖ్యమంత్రిలను కీలుబొమ్మలు లాగా మార్చి.. వారితో ఆటలాడించే పార్టీగా కాంగ్రెస్ కు జాతీయ రాజకీయాలలో మంచి పేరే ఉంది. అక్కడ దాకా ఎందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సందర్భాలలో ముఖ్యమంత్రులను మార్చి కాంగ్రెస్ పార్టీ తన పేరును మరొకసారి సార్ధకం చేసుకుంది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది. ఆ తర్వాత కొద్ది రోజులకు రోశయ్యను పక్కనపెట్టి కిరణ్ కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. బహుశా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రిగా సేవలు అందించిన రికార్డు కిరణ్ కుమార్ రెడ్డి సొంతం చేసుకున్నారు.. సరిగ్గా 11 సంవత్సరాల క్రితం తెలుగు రాష్ట్రం విడిపోయింది.. రెండు ముక్కలైంది. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో రెండు పర్యాయాలు భారత రాష్ట్ర సమితి అధికారాన్ని అనుభవించింది. ఇక ఆంధ్రప్రదేశ్లో ఒకసారి టిడిపి.. మరొకసారి వైసిపి అధికారంలోకి వచ్చాయి. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం అధికారాన్ని దక్కించుకుందితెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాది పరిపాలన విజయవంతంగా పూర్తి చేసుకుంది. రెండవ ఏడాదిలోకి అడుగు పెట్టింది. ఇటీవల మంత్రివర్గ విస్తరణ కూడా చేపట్టింది. అందులో ముగ్గురికి మంత్రి పదవులు లభించాయి. వారంతా కూడా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే. ఈ క్రమంలో వారికి కేటాయించిన శాఖల విషయంలో అనేక మతలబు జరిగింది. కనుక సందర్భంలో ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ శాఖను తనకు కావాలని కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి కోరినట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఢిల్లీలో భారీ స్థాయిలో మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి హస్తిన వెళ్లిన తర్వాత ఒక్కసారిగా సీన్ మారిపోయిందని.. తన వద్ద ఉన్న కార్మిక శాఖ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, పశుసంవర్ధక శాఖలను మాత్రమే ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. తన వద్ద ఉన్న విద్య, హోం, మున్సిపల్ శాఖలను ఇవ్వడానికి ఒప్పుకోనట్లు తెలుస్తోంది. వాస్తవానికి తన వద్ద ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇస్తానని హస్తినలో విలేకరులతో జరిగిన చిట్ చాట్ లో రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీంతో తమకు కీలక శాఖలు దక్కుతాయని.. కొత్తగా ఏర్పడిన మంత్రులు భావించారు. కానీ అది అంత సులభం కాదని రేవంత్ రెడ్డి నిరూపించారు. కాకపోతే అధిష్టానం అనుమతి తీసుకుని తనకు అనుకూలంగా వ్యవహారాల సాగేలా రేవంత్ పావులు కదిపారు. దీంతో కొత్తగా ఏర్పడిన మంత్రులకు నామమాత్రంగా శాఖలు దక్కాయి. మంత్రి పదవవైతే దక్కింది చాలు.. శాఖల సంగతి తర్వాత అన్నట్టుగా.. ఆ మంత్రుల శైలి ఉన్నట్టు తెలుస్తోంది.

## కరెంట్ కు తల్లికి వందనానికి లింక్



జయభేరి, విజయవాడ, జూన్ 14:

రాష్ట్రవ్యాప్తంగా తల్లికి వందనం నిధులు జమ చేసినట్లు చెబుతోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మందికి పైగా అర్హులు ఉన్నట్లు తేల్చింది. కానీ రకరకాల కారణాలు చెబుతూ ఈ జాబితాలో చాలా వరకు కోత పడింది. ముఖ్యంగా 300 యూనిట్ల విద్యుత్ వినియోగం అంటూ అనర్హుల జాబితాలో చేర్చడం ఆందోళన కలిగిస్తోంది. అసలు విద్యుత్ బిల్లుల విషయంలో అస్పష్టత కొనసాగుతోంది. ట్రూ ఆఫ్ చార్జీలు పెరిగాయని ఒకసారి.. తగ్గాయని మరోసారి.. ఇలా విద్యుత్ చార్జీల్లో వ్యత్యాసం కనిపించింది. అయితే ఇది సర్వసాధారణ చర్యగా భావించిన సామాన్యులకు ఇప్పుడు తల్లికి వందనం రూపంలో షాక్ తగిలింది. మీరు నిర్దేశించిన యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగించారంటూ తల్లికి వందనం పథకంలో కోత విధించారు. దీనికి తోడు సాంకేతిక సమస్యలు, ఆధార్ సీడింగ్ అంటూ కొత్త మెలికలు పెట్టి భారీగా కోత విధిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారువిద్యుత్ వినియోగం300 యూనిట్ల కంటే అధికంగా ఉంటే జగన్ సర్కార్ అమ్మ ఒడి పథకాన్ని నిలిపివేసింది. అప్పట్లో దీనిని తప్పు పట్టింది కూటమి. కరెంటు ఎక్కువ కాలిస్తే పథకం నిలిపివేస్తారా అని నిలదీసింది. ఇప్పుడు అదే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చింది. కరెంటు ఎక్కువగా వినియోగిస్తే పథకం ఇవ్వలేమంటూ తేల్చేసింది. అయితే సామాన్యుడికి విద్యుత్ చార్జీల విషయంలో అవగాహన లేదు. అందుకే విద్యుత్ వినియోగం విషయంలో ఏం చేయాలో పాలు పోక.. వచ్చిన బిల్లును కట్టుకుంటూ ముందుకు సాగాడు. కానీ తీరా ఇప్పుడు పథకం అమలు విషయానికి వచ్చేసరికి షాక్ తగిలేలా కూటమి సర్కార్ విద్యార్థుల తల్లిదండ్రులకు చేదు వార్త వినిపించింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా తల్లుల ఖాతాలో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్ తల్లికి వందనం నిధులు జమ చేశారు. కానీ సాయంత్రానికే ప్రతి గ్రామంలో పదిమందికి తగ్గకుండా విద్యుత్ వినియోగం అధికం చేశారన్న నెపంతో పథకాన్ని నిలిపివేశారు. దీంతో కొందరు తల్లులకే వందనమా అంటూ సెటైర్లు పడుతున్నాయి. ఒక ఏడాది సాయాన్ని ఇప్పటికే హరించారు. ఇప్పుడు వస్తుందనుకున్న తల్లికి వందనం పథకం రాకపోయేసరికి సగటు లబ్ధిదారుడు కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహంగా ఉన్నాడు. కనీసం ముందస్తుగా మార్గదర్శకాలు, వినతులు స్వీకరించి ఉంటే ఇటువంటి సాంకేతిక సమస్యలు అధిగమించే అవకాశం ఉంది. కానీ ఉన్నపలంగా మార్గదర్శకాలు జారీ చేయకుండా.. కొందరి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసి.. 300 యూనిట్ల విద్యుత్ వినియోగం పేరిట కొత్త విధించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.మరికొందరు 300 యూనిట్ల విద్యుత్ వినియోగించకుండానే పథకానికి అనర్హుల పేరిట తేల్చేయడంపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఇదేమని సచివాలయాలకు వెళ్తుంటే.. విద్యుత్ కార్యాలయాలకు పంపిస్తున్నారు. విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళితే అంతా సరిగ్గా ఉంది సచివాలయాలకు వెళ్ళండి అంటూ సూచిస్తున్నారు. దీంతో సామాన్యుడికి అర్థం కావడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో లేని నిబంధనలు.. ఇప్పుడు తెరపైకి రావడం పై ఎక్కువ మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు ఎక్కువ కాల్చితే.. పథకాలు నిలిపివేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు విద్యుత్ చార్జీలు పెరిగాయి. కుటుంబ అవసరాల కోసం విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో కొంతమంది అధికంగా విద్యుత్ వినియోగించారు. సాధారణంగా వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువ. దీంతో ఏడాది ప్రాతిపదికగా తీసుకొని విద్యుత్ వినియోగాన్ని లెక్కించలేదు.



## గద్దర్ అవార్డ్స్ లో గద్దర్ మిస్సింగ్

జయభేరి, హైదరాబాద్, జూన్ 14:

ఏం చేసినా వివాదమే.. ఏదో ఒక లోపమే.. సోషల్ మీడియాలో రభస అవుతున్నది. ప్రధాన మీడియా దెప్పి పొడుస్తోంది. అయినప్పటికీ రేవంత్ ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది. చివరికి ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా ఉండడం లేదు.. ఇలా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. ప్రభుత్వ వైఫల్యమా? విపరీతమైన నిర్లక్ష్యమా? అనేది అంతు పట్టడం లేదు.

అప్పుడెప్పుడో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నంది అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ పురస్కారాలను ఇచ్చింది లేదు. కెసిఆర్ ప్రభుత్వం మొత్తానికే ఆ అవార్డులను కోల్డ్ స్టోరేజ్ లో పడేసింది. దాదాపు దశాబ్ద కాలంగా తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం తరపున అవార్డులు ఇచ్చింది లేదు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి పురస్కారాలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణలో వాగ్గేయకారుడుగా.. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గద్దర్ స్మృత్యర్థం అవార్డును ప్రకటించారు రేవంత్ రెడ్డి. గద్దర్ పేరు మీద ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ నటినటులకు, సాంకేతిక నిపుణులకు, ఇతర బృందాలకు పురస్కారాలను అందిస్తామని వెల్లడించారు. అంతేకాదు అవార్డుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సినీ నటి జయసుధ, ప్రఖ్యాత నిర్మాత దిల్ రాజులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటీనటులు, ఇతర సాంకేతిక బృందాలకు అవార్డులను ప్రకటించింది ప్రభుత్వం. శనివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ప్రభుత్వం చేసిన తప్పు వివాదంగా మారింది. సోషల్ మీడియాలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.గద్దర్ అవార్డుల ప్రధానోత్సవానికి సంబంధించి ముద్రించిన ఆహ్వాన పత్రికలో రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు ఫోటోలను మాత్రమే ప్రచురించారు. గద్దర్ అవార్డుకు సంబంధించిన ప్రతిమను కూడా అందులో ప్రముఖంగా చూపించారు. అయితే టీజీఎఫ్ఏ పేరుమీద ఈ ఆహ్వాన పత్రికను ముద్రించారు. అయితే ఈ ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటోను ముద్రించడం మర్చిపోయినట్టున్నారు. ఆహ్వాన పత్రిక ఒక్కసారిగా వెలుగులోకి రావడంతో వివాదం మొదలైంది. అసలే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి.. బజార్లో నిలబెట్టడానికి భారత రాష్ట్ర సమితి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఈలోగా ఈ ఆహ్వాన పత్రిక విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి నెగిటివ్ ప్రచారానికి శ్రీకారం చుట్టింది.. ఇన్నేళ్లపాటు అవార్డులు ఎందుకు ఇవ్వలేదు? అనే విషయాన్ని పూర్తిగా మర్చిపోయి... అధికారంలో ఉన్నప్పుడు గద్దర్ కు అపాయింట్మెంట్ ఇవ్వని విషయాన్ని పక్కనపెట్టి.. రేవంత్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది.అయితే ఇంత జరుగుతున్నప్పటికీ.. ఇంతలా నెగటివ్ ప్రచారం చోటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం తరపునుంచి ఇంతవరకు ఒక్కరు కూడా మాట్లాడలేదు. అఫ్ కోర్స్ ఇటీవల కాలంలో భారత రాష్ట్రసమితి ఎన్ని రకాలుగా ఆరోపణలు చేసినా.. ఏ స్థాయిలో విమర్శలు చేసినా.. కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందన ఉండటం లేదు. ఆ పార్టీలో అధికార ప్రతినిధులు ఉన్నామంటే ఉన్నారు. పదవుల కోసం పైరవీలు చేయడం తప్ప.. ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప.. వారు పార్టీ కోసం చేస్తున్నది ఏమీ లేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇక ఎప్పటి లాగానే భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియాలో రెచ్చిపోతోంది. యధావిధిగా కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉండిపోతుంది.

# ఏపీలో టాలీవుడ్ కు మంచి రోజులేనా..?

- సీఎంతో పెద్దల భేటీ

జయభేరి, విజయవాడ, జూన్ 14:



ఆంధ్ర ప్రదేశ్ లో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఎట్టకేలకు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఏపీ సీఎం చంద్రబాబును కలవనున్నారు. వాస్తవానికి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ముఖ్యమంత్రిని సినీ ప్రముఖులు కలవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భం లేదు. అయితే సినీ పరిశ్రమకు చెందిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మాత్రం సినీ పెద్దలు కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. పనిలో పనిగా తెలుగు చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు. అయితే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకుందామని సినీ పరిశ్రమ పెద్దలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. త్వరలో మీరంతా సీఎం చంద్రబాబును కలవాలని సూచించారు. అయితే ఇటీవల హరిహర వీరమల్లు సినిమా విడుదల ప్రకటన వచ్చింది. అంతకంటే ముందే సినిమా థియేటర్ల బంద్ ప్రతిపాదన వచ్చింది. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రకటన వచ్చింది. చిత్ర పరిశ్రమ కోసం తాను కృషి చేస్తుంటే తనకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తారా? అంటూ పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు తర్వాత జరిగిన పరిణామాలతో ఈ నెల 15న సినీ పరిశ్రమ పెద్దలు ఏపీ సీఎం చంద్రబాబును కలిసేందుకు అపాయింట్మెంట్ తీసుకున్నారు.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ విస్తరించే ప్రయత్నం జరగడం లేదు. కేవలం హైదరాబాద్ కు సినిమా షూటింగులు పరిమితం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ కేవలం సినిమా మార్కెట్ కు పరిమితం అయింది. విశాఖలో షూటింగులు జరుగుతున్నా హైదరాబాద్ స్థాయిలో మాత్రం సాగడం లేదు. అవుట్ డోర్ షూటింగ్ లలో భాగంగా గోదావరి జిల్లాల్లో సైతం మునుపటి మాదిరిగా జరగడం లేదు. విజయవాడ తో పాటు తిరుపతి పరిసర ప్రాంతాలు షూటింగులకు అనుకూలంగా ఉన్నా సినీ నిర్మాతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అటు విశాఖ మన్య ప్రాంతం సినిమా షూటింగులకు అనుకూలం. అయితే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరణకు ఇదే సరైన సమయం. ఎందుకంటే ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమ విస్తరణకు.. ఆ రంగ ప్రముఖులకు కీలక సూచనలు ఇస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోందిసినిమా మాధ్యమం పై ఆధారపడి వేలాది మంది బతుకుతున్నారు. అలాగే ఇదో ఎంటర్టైన్మెంట్రంగంగా ఉంది. ప్రజలకు వినోదం పంచుతోంది. అయితే సినిమాల మాటున దోపిడీ జరుగుతోందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ప్రధానంగా సినిమా థియేటర్ల లో టికెట్ల ధరలు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్నాయి. అక్కడ లభించే కూల్ డ్రింక్స్, ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలంటే సామాన్యుడికి వీలుపడదు. సెలవు రోజున సగటు చిన్న కుటుంబం సినిమాకు వెళ్తే.. జేబులో వెయ్యి రూపాయలు ఉండాల్సిందే. అంతలా బాదుడు ఉంటోంది. ఒక సినిమా పది రోజులు ప్రదర్శిస్తేనే హిట్ టాక్ వచ్చే రోజులు ఇవి. అందుకే ఆ కొద్ది రోజుల్లోనే ప్రేక్షకుడి నుంచి బాదుడు తప్పడం లేదు. అందుకే థియేటర్లకు రాయితీలు ఇవ్వాలి. ఆపై సినిమా షూటింగులకు తగ్గట్టు ఏపీని విస్తరించాలి. స్థానిక కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఇవి చేస్తేనే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరిస్తుంది. నలుగురికి ఉపాధి దొరుకుతుంది.రాష్ట్ర విభజనజరిగి 11 సంవత్సరాలు అవుతోంది. కానీ ఇంతవరకు తెలుగు సినీ పరిశ్రమ విస్తరణ జరగలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప కార్యరూపం దాల్చలేదు. సినీ పరిశ్రమ ద్వారా తెలంగాణకు ఆదాయం వస్తుంటే.. మార్కెట్ విస్తరణకు మాత్రం ఏపీ ఉపయోగపడుతోంది. చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల వరకు ఎవరికీ వారే సినిమా టిక్కెట్ల ధర పెంపునకు ఏపీ ప్రభుత్వ అనుమతి తీసుకుంటున్నారు. కానీ ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరించాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరణకు అవసరమైన అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కానీ ఎక్కడో ప్రయత్న లోపం జరుగుతోంది. ఆపై సినీ పరిశ్రమ నుంచి కూడా మద్దతు కరువవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబుకు సినీ పరిశ్రమ పెద్దలు కలవనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ కలయిక మర్యాదపూర్వకంగా కాకుండా.. ఏపీలో పరిశ్రమ విస్తరణ, సగటు ప్రేక్షకుడకు అదనపు బాదుడు లేకుండా వినోదం పంచడం వంటి చర్యలపై దృష్టి పెడితే ఎంతో మేలు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కల్పికకు వరుస కేసులు

జయభేరి, హైదరాబాద్, జూన్ 14:

సినీ నటి కల్పికా గణేశ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇప్పటికే ప్రిజం క్లబ్ వ్యవహారంలో కేసు ఎదుర్కొంటున్న ఆమెపై తాజాగా మరో సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. ఇన్స్టాగ్రామ్ ద్వారా తనను అసభ్య పదజాలంతో దూషించారని, ఆన్లైన్లో వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కీర్తన అనే యువతి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.వివరాల్లోకి వెళితే, కల్పికా గణేశ్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా తనను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన భాషను ఉపయోగించారని బాధితురాలు కీర్తన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తన గురించి అభ్యంతరకరమైన స్టేటస్‌లు పెట్టడంతో పాటు, ఇన్‌బాక్స్‌కు మెసేజ్‌లు పంపి దారుణంగా మాట్లాడారని



ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపులకు సంబంధించి కొన్ని స్క్రీన్‌షాట్లను కూడా కీర్తన పోలీసులకు ఆధారాలుగా సమర్పించారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన అనంతరం నటి కల్పికా గణేశ్ పై కేసు నమోదు చేశారు. ఐటీ చట్టం 2000, 2008లోని సెక్షన్ 67, అలాగే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని సెక్షన్లు 79, 356 కింద ఈ కేసును నమోదు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.కాగా, కొద్ది రోజుల క్రితమే హైదరాబాద్‌లోని ప్రిజం పబ్ వివాదంలో కూడా కల్పికా గణేశ్ పేరు వినిపించిన సంగతి తెలిసిందే. ఆ కేసుకు సంబంధించి కూడా ఆమెపై కేసు నమోదై విచారణ కొనసాగుతోంది. ఇప్పుడు ఈ తాజా సైబర్ వేధింపుల ఆరోపణలతో కల్పిక మరోసారి చిక్కుల్లో పడినట్లయింది. ఈ వరుస ఘటనలతో ఆమె కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



## కావ్య మారన్‌తో పెళ్లి వార్తలపై స్పందించిన అనిరుధ్.. ఏమన్నారంటే..

సినీతారల వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడానికి నెటిజన్స్ తెగ ఆసక్తి చూపిస్తుంటారు. ముఖ్యంగా హీరోహీరోయిన్స్ ప్రేమ, పెళ్లి, డివోర్స్.. ఇలా వారికి సంబంధించిన పర్సనల్ విషయాలు నిత్యం నెట్టింట చక్కర్లు కొడుతుంటాయి. త్వరలోనే ఆ స్టార్స్ పెళ్లి చేసుకోబోతున్నారంటూ ప్రచారం నడుస్తుంటుంది. తాజాగా సన్ రైజర్స్ టీమ్ ఓనర్ కావ్య మారన్ పెళ్లి గురించి నెట్టింట తెగ రూమర్స్ వినిపిస్తున్నాయి. కొన్ని రోజులుగా మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచంద్రన్, కావ్య మారన్ ప్రేమలో ఉన్నారని.. వీరిద్దరు త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారంటూ టాక్ నడుస్తుంది. దీంతో గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో కావ్య మారన్, అనిరుధ్ ఫోటోస్ షేర్ చేస్తున్నారు నెటిజన్స్. తాజాగా వీటిపై అనిరుధ్ స్పందించారు. సోషల్ మీడియాలో కావ్య మారన్ తో తన పెళ్లంటూ వస్తున్న వార్తలపై అనిరుధ్ స్పందించారు. "పెళ్లా.. ? జస్ట్ చిల్ అవుట్ గాయ్స్.. రూమర్స్ ప్రచారం చేయడం ఆపండి" అంటూ ట్వీట్ చేశారు. దీంతో కావ్య మారన్, అనిరుధ్ పెళ్లి గురించి వస్తున్న రూమర్స్ కు చెక్ పడింది. కావ్య మారన్ విషయానికి వస్తే.. సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఐపీఎల్ మ్యాచ్ సమయంలో మైదానంలో తనదైన హావభావాలతో పాపులర్ అయ్యారు. ప్రస్తుతం ఆమె కళానిధి వ్యాపారాలను చూసుకుంటున్నారు. అలాగే సన్ రైజర్స్ హైదరాబాద్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. కళానిధి మారన్ నిర్మాతగా కొనసాగుతున్నారు. జైలర్, బీస్ట్, రాయన్ చిత్రాలను నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే.. అనిరుధ్ రవిచంద్రన్ పెళ్లి గురించి రూమర్స్ రావడం ఇది మొదటిసారి కాదు. గతంలో హీరోయిన్ కీర్తి సురేష్ తో సైతం అనిరుధ్ ప్రేమలో ఉన్నాడని.. త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారనే టాక్ నడిచింది. అంతకుముందు హీరోయిన్ ఆండ్రియాతో అనిరుధ్ ప్రేమ వ్యవహారం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు కావ్య మారన్ తో ప్రేమ, పెళ్లి అనే వార్తలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

## ఆ రుణం తీరేదెలా? .. ఎన్టీఆర్



'ఆర్ఆర్ఆర్' తర్వాత పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఆయన డైరీ నిండా పాన్ ఇండియా ప్రాజెక్టులే. బాలీవుడ్‌లో తారక్ నటించిన 'వార్ 2' పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా, ప్రశాంత్‌నీల్‌తో చేస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఈ ఏడాది ఆగస్ట్ 14న 'వార్ 2' విడుదల కానుండగా, వచ్చే ఏడాది ప్రశాంత్ నీల్ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత 'జైలర్'ఫేం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్నారు తారక్. ప్రస్తుతం 'జైలర్ 2' పనుల్లో బిజీగా ఉన్న నెల్సన్, ఆ ప్రాజెక్ట్ తర్వాత ఎన్టీఆర్ సినిమా పని మొదలుపెడతారు. వచ్చే ఏడాది చివర్లో గానీ, 2027 సంక్రాంతికి కానీ ఈ సినిమా విడుదల ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. దీని తర్వాత త్రివిక్రమ్‌తో చేయబోయే మైథాలజీ మూవీ ఉంటుందని తారక్ సన్నిహితుల సమాచారం. అంటే ఈ సినిమా 2028 నాటి ముచ్చటన్నమాట. మరి ఇన్ని పానిండియా ప్రాజెక్టుల మధ్య 'దేవర 2' మాటేంటి? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. మరి ఈ రుణాన్ని తారక్ ఎలా తీర్చుకుంటారో చూడాలి.



## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రభుత్వం హైటెక్స్ లో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అద్భుతంగా నిర్వహించారు. ఈ వేడుకలో సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఇక కళారంగంలో అత్యంత ప్రతిభ కనపర్చిన వారికి అవార్డులను అందించారు. అంతేకాకుండా ప్రశంసా పత్రంతో పాటు క్యాష్ ప్రైజ్ ను కూడా అందించారు.

మణిరత్నం, సుహాసిని, మురళీ మోహన్, జయసుధ, జయప్రద, అల్లు అర్జున్, నందమూరి బాలకృష్ణ, విజయ్ దేవరకొండ, రీతూ వర్మ, నివేదా థామస్, అనన్య నాగళ్ల తదితరులు పాల్గొన్నారు. ఇక గద్దర్ అవార్డ్స్ 2024 విన్నర్స్ గా గెలిచి అవార్డులు అందుకున్నవారు ఎవరెవరంటే..



ఉత్తమ స్క్రీన్ ప్లే అవార్డు: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గేయ రచయిత అవార్డు: చంద్రబోస్ (రాజు యాదవ్ )
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డు: అర్చన రావు, అజయ్ కుమార్ (కల్కి 2898 AD)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు: నల్లా శ్రీను (రజాకార్ )
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ అవార్డు: విశ్వనాధ్ రెడ్డి(గామి)
ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్ అవార్డు : అధ్నితిన్ జిహాన్ చౌదరి( కల్కి 2898 AD)
ఉత్తమ ఎడిటర్ అవార్డు : నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
ఉత్తమ కథా రచయిత అవార్డు : శివ పాలమడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి )
ఉత్తమ కొరియోగ్రఫర్ అవార్డు: గణేష్ ఆచార్య (దేవర)
ఉత్తమ కమెడియన్ అవార్డు: సత్య , వెన్నెల కిషోర్ (మత్తు వదలరా)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్ అవార్డు: చంద్రశేఖర్ రాథోడ్ ( గ్యాంగ్ స్టార్ )
ఉత్తమ ఫిమేల్ ప్లే బ్యాక్ సింగర్ అవార్డు :శ్రేయ ఘోషల్ ( పుష్ప 2 .. సూసేకి సాంగ్ )
ఉత్తమ మేల్ ప్లే బ్యాక్ సింగర్ అవార్డు : సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవ కోన.. నిజమేనే చెప్తున్నా సాంగ్ )
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ అవార్డు: భీమ్స్ సిసిరోలియో( రజాకార్ )
ఉత్తమ ఫిమేల్ సపోర్టింగ్ అవార్డు: శరణ్య ప్రదీప్ ( అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్ )
ఉత్తమ మేల్ సపోర్టింగ్ అవార్డు : SJ సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ బాలల చిత్రం అవార్డు: 35 చిన్న కథ కాదు
ఉత్తమ ప్రజాదరణ చిత్రం అవార్డు: ఆయ్
ఉత్తమ ఫ్యూచర్ ఫిల్మ్ అవార్డు: కమిటీ కుర్రాళ్లు
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డు: అరుణ్ దేవ్( 35 చిన్న కథ కాదు), హారిక(మెర్సీ కిల్లింగ్)
ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ ఆన్ హిస్టరీ అవార్డు: రజాకార్
ఉత్తమ జ్యూరీ అవార్డు : దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
స్పెషల్ జ్యూరీ అవార్డు: పొట్టేలు (అనన్య నాగళ్ల )
స్పెషల్ జ్యూరీ అవార్డు: క (సుజీత్, సందీప్ )
స్పెషల్ జ్యూరీ అవార్డు : రాజు యాదవ్ (రాజేష్ కళ్లేపల్లి)
జ్యూరీ స్పెషల్ మెన్షన్ అవార్డు: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా ర్యాప్ సాంగ్ )
ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ డెబ్యూ అవార్డు: కమిటీ కుర్రాళ్లు
ఉత్తమ తృతీయ ఫీచర్ ఫిల్మ్ అవార్డు: లక్కీ భాస్కర్
ఉత్తమ ద్వితీయ ఫీచర్ ఫిల్మ్ అవార్డు: పొట్టేల్
ఉత్తమ చిత్రం అవార్డు: కల్కి 2898 AD
ఉత్తమ దర్శకుడు అవార్డు: నాగ అశ్విన్ (కల్కి 2898 AD)



ఉత్తమ నటి అవార్డు: నివేదా థామస్( 35 చిన్న కథ కాదు)
ఉత్తమ నటుడు అవార్డు : అల్లు అర్జున్ (పుష్ప 2)
ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు: నందమూరి బాలకృష్ణ
పైడి జైరాజ్ అవార్డు: మణిరత్నం
కాంతారావు ఫిల్మ్ అవార్డు : విజయ్ దేవరకొండ
BN రెడ్డి ఫిల్మ్ అవార్డు : సుకుమార్
నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు: అట్లూరి పూర్ణచంద్రరావు
రఘుపతి వెంకయ్య అవార్డు : యండమూరి వీరేంద్ర నాథ్

## తారలనే చీరగా మలచి..

అలేఖ్య హారిక.. దేత్తడి హారికగా యూట్యూబ్ స్టార్‌గా తెలుగు రాష్ట్రాల్లో బాగా ఫేమస్. హైదరాబాద్ యాసలో మాట్లాడుతూ.. యూట్యూబ్ లో అందరికీ ఇచ్చిపడేసే వీడియోలతో నెట్టింట బాగా పాపులర్ అయింది. బిగ్ బాస్ సీజన్ 4లో ఒక కంటెస్టెంట్ అని మనకి తెలిసిందే. తాజాగా తన ఇంస్టాగ్రామ్ అకౌంటులో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది ఈ భామ. 9 సెప్టెంబర్ 1997న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది అందాల తార అలేఖ్య హారిక. ఈ బ్యూటీకి వంశీ కార్తీక్ అనే ఒక సోదరుడు కూడా ఉన్నాడు. దేత్తడి హారికగా యూట్యూబ్ వీడియోలతో నెట్టింట బాగా పాపులర్ అయింది ఈ బ్యూటీ హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో స్కూలింగ్ విద్య పూర్తిచేసింది. మెహదీపట్నంలో ఉన్న సెయింట్ ఆన్స్ కళాశాల నుంచి బ్యాచలర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి డిగ్రీ పట్టా పొందింది ఈ వయ్యారి భామ. అలేఖ్యకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై మక్కువ ఎక్కువ. చిన్నప్పటి నుంచి కొరియోగ్రాఫర్ కావాలని కోరిక. 2015లో ఆమె హైదరాబాద్‌లోని అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్‌గా చేరింది. అలేఖ్య దాదాపు మూడు సంవత్సరాలు అక్కడ పని చేసింది. తర్వాత యూట్యూబ్ వీడియోలు చేస్తూ పాపులారిటీ సంపాదించుకుంది. ఈ పాపులారిటీతో దేత్తడి హారిక స్టార్ మా ప్రసారం అయినా బిగ్గెస్ట్ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 4లో ఒక కంటెస్టెంట్‌గా సెలెక్ట్ అయింది ఈ వయ్యారి భామ. హౌజ్‌లో తనదైన అల్లరి పనులతో టాప్ 5లో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. తర్వాత తెలుగులో ఆదిత్య వర్మ, వరుడు కావలెను, శ్రీకారం, సింబా అనే సినిమాల్లో చిన్న పాత్రల్లో కనిపించింది. ఓ సినిమాలో కథానాయికగా అవకాశం అందుకుంది. సంగీత్ శోభన్ సరసన తొలిసారి హీరోయిన్‌గా చేస్తుంది ఈ బ్యూటీ.



## సీక్వెల్‌ను ఊహించలేను.. కాజోల్



బాలీవుడ్ ఐకానిక్ చిత్రం.. దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే! ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఏమాత్రం లేదని అంటున్నది అగ్ర తార కాజోల్. రాజ్‌సిమ్రన్ కథను కొనసాగించకపోవడమే మంచిదని అంటున్నది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజోల్.. 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' సినిమా సీక్వెల్‌పై తన అభిప్రాయాన్ని పంచుకున్నది. "డీడీఎల్‌జే2ని ఊహించలేను. రైల్వే స్టేషన్ నుంచి రైలు బయల్దేరిన తర్వాత ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఎవరూ ఉత్సాహం చూపించడం లేదు. రాజ్‌సిమ్రన్.. తమ పిల్లల డైపర్ల కోసం గొడవ పడటం కూడా చూడాలని అనుకోవడం లేదు. అందుకే.. మేము కూడా ఈ ఐకానిక్ సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలని అనుకోవడం లేదు" అంటూ చెప్పుకొచ్చింది. "నిజానికి.. ఆ సినిమా క్లయిమాక్స్ అద్భుతంగా ఉంటుంది.

ఆ ప్రేమజంట జీవితం ఎలా ఉంటుందో.. ప్రేక్షకుల ఊహకే వదిలేశాడు దర్శకుడు. ప్రేక్షకులు కూడా.. వాళ్లు ఎప్పటికీ సంతోషంగా జీవిస్తారనే కోరుకుంటారు" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఇక తాను షారుక్‌తో కలిసి నటించిన మరో బ్లాక్‌బస్టర్ సినిమా.. 'కుచ్ కుచ్ హోతా హై' సీక్వెల్‌పైనా స్పందించింది. "ఆకాలం వేరు. ప్రజలంతా శాశ్వతమైన ప్రేమను నమ్మిన యుగం అది. నేటికాలంలో అలాంటి సినిమాను తిరిగి సృష్టించడం చాలా కష్టం" అని చెప్పింది. షారుక్ ఖాన్ - కాజోల్ జంటగా 1995లో వచ్చిన దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే సినిమా.. బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీల్లో ఒకటిగా నిలిచింది.

రన్నింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. 1995 అక్టోబర్ 20న విడుదలైన ఈ చిత్రం.. ముంబైలోని 'మరాఠా మందిర్ థియేటర్'లో ఇప్పటికీ ప్రదర్శితమవుతూనే ఉండటం విశేషం! ప్రఖ్యాత దర్శక నిర్మాత యశ్ చోప్రా తనయుడు ఆదిత్య చోప్రా ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇక కాజోల్ సినిమాల విషయానికి వస్తే.. ఆమె నటించిన హర్రర్ చిత్రం 'మా' విడుదలకు సిద్ధంగా ఉంది. విశాల్ ఫురియా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాజోల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. రోనిత్ రాయ్, ఇంద్రనీల్ సేన్‌గుప్తా, ఖేరిన్ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com